



నువ్వా.. నేనా..
కాకినాడలో మూడో రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు 6

తునిలో.. వై..చీప్ ట్రిక్స్!



తుని మునిసిపల్ కార్యాలయ భవనం

తుని వైస్ చైర్మన్ ఎన్నికలో వైసీపీ డ్రామాలు

- వైసీపీ కౌన్సిలర్లు గైర్హాజరు
- ఇప్పటికే మూడుసార్లు వాయిదా
- పాగాకు వైసీపీ.. టీడీపీ పట్టు
- టీడీపీలో 10 మంది ఫ్యాన్ కౌన్సిలర్లు
- మిగిలిన 17 మంది ఎటువైపో..
- ఆందోళనలో వైసీపీ నాయకులు
- ఎన్నికకు హాజరుకాకుండా నిర్బంధం
- చైర్‌పర్సన్ ఇంట్లో బంధించిన రాజా
- నేడు నాలుగోసారి ఎన్నిక
- కోరం లేక.. రెండుసార్లే వాయిదా
- తరువాత కోరం అవసరమేలేదు

కాకినాడ/తునిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని తుని మునిసిపాలిటీలో వైస్‌చైర్మన్ ఎన్నిక వ్యవహారం రకరకాల మలుపులు తిరుగుతోంది. ఎలాగైనా ఈ కుర్చీలో పాగా వేయాలని టీడీపీ, మిగిలిన సభ్యులు చేజారిపోకుండా కాపాడుకోవాలని వైసీపీ ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. దీంతో కోరం లేక సోమవారం జరగాల్సిన ఎన్నిక మూడోసారీ రద్దయింది. తిరిగి మంగళవారం నాలుగోసారి ఎన్నిక నిర్వహించనున్నారు. ఈసారి కూడా మళ్లీ కోరం డ్రామా కొనసాగుతుందా? లేదంటే ఎన్నిక జరుగుతుందా? అనేది సస్పెన్స్‌గా మారింది. ఈ ఎన్నిక ఎలాగైనా నిర్వహించాలని హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ ఎన్నికకు హాజరుకాకుండా వ్యవహరిస్తుండడం విశేషం.

మూడోసారీ అదే డ్రామా..

తుని మునిసిపాలిటీ వైస్‌చైర్మన్ ఎన్నిక మూడోసారి సోమవారం జరుగుతుందని అంతా భావించారు. కుర్చీ ఏ పార్టీ ఖాతాలో పడుతుందోనని రకరకాల లెక్కలు వేశారు. తీరా యథావిధిగా కోరంలేకపోవడంతో ఎన్నిక రద్దయింది. దీంతో అంతా ఈసురోమనాల్సిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఉదయం 11 గంటలకు ఎన్నిక నేపథ్యంలో ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో చేరిన 10 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. దీంతో టీడీపీవైపు పూర్తి హాజరు ఉంది. వైసీపీ నుంచి 17 మంది కౌన్సిలర్లు హాజరవుతారని అధికారులు భావించారు. కానీ సమయం మించిపోతున్నా వైసీపీ కౌన్సిలర్లు మాత్రం రాలేదు. వైసీపీకి చెందిన మునిసిపల్ చైర్‌పర్సన్ తన నివాసంలో వీరందరినీ దాచేయడంతో వీరంతా ఎన్నికకు రాలేని పరిస్థితి. మరోపక్క మాజీ మంత్రి దాడి శెట్టి రాజా సైతం సోమవారం నాటి ఎన్నిక వాయిదా పడేలా ముందు నుంచీ కథ నడిపారు. అక్కడకు తుని పట్టణ వ్యాప్తంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను రాజా మోహరించారు. టీడీపీ నుంచి ప్రతిఘటన వస్తే ఎదుర్కొనేందుకు వీలుగా వారిని గొడవకు సిద్ధంచేశారు. అదే సమయంలో టీడీపీ నేతలు చైర్‌పర్సన్ నివాసానికి సమీపానికి వచ్చి ఆందోళన చేపట్టారు. ఎన్నిక జరగకుండా రాజా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కౌన్సిలర్లను స్వేచ్ఛగా సమావేశానికి రానీయకుండా ఓటమి భయంతో నిర్బంధించారని మండిపడ్డారు. దీంతో రాజా, ఆయన అనుచరులు టీడీపీ నేతలతో గొడవకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. దీంతో ఉద్రిక్తతకు దారితీసింది. అటు గొడవను కట్టడి చేయడానికి ప్రయత్నించిన పోలీసులపై రాజా దురుసుగా వ్యవహరించారు. టీడీపీకి అనుకూలంగా పోలీసులు ఉన్నారంటూ వారిపైకి గొడవకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వేచిచూసిన అధికారులు సగం మంది సభ్యులైన 15 మంది కూడా లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

వైసీపీ ప్రస్తుత వ్యూహం.. కూటమికే ప్రయోజనం?

నిబంధనల ప్రకారం మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి కోరం లేకపోతే రెండుసార్లు మాత్రమే ఎన్నిక వాయిదా వేయొచ్చు. ఆ తర్వాత కోరంతో సంబంధం లేకుండా ఎంతమంది సభ్యులు ఎన్నికకు హాజరైతే వారితోనే ఎన్నిక ప్రక్రియ నిర్వహించేందుకు అవకాశం ఉంది. ఇప్పటివరకు మూడుసార్లు ఎన్నిక రద్దవగా, అందులో రెండుసార్లు శాంతి భద్రతల సమస్య కారణంగా వాయిదా వేశామని, సోమవారం మాత్రమే కోరం లేని కారణంగా ఎన్నిక రద్దయిందని అధికారులు చెబుతున్నారు. మంగళవారం ఇదే కారణంతో ఎన్నిక వాయిదా వేస్తే ఆ తర్వాత మాత్రం హాజరైన సభ్యులతో ఎన్నిక నిర్వహించవచ్చు. మంగళవారం ఎన్నికకు టీడీపీ నుంచి 10 మంది కౌన్సిలర్లు హాజరవుతారు. మరో నలుగురు కౌన్సిలర్లు హాజరైతే తగిన కోరంతో ఎన్నిక జరపవచ్చు.

నేడైనా తేలేనా..

తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక తిరిగి నేడు (మంగళవారం) నాలుగోసారి జరగనుంది. ఈ మేరకు ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. అయితే సోమవారం నాటి ఆందోళనల నేపథ్యంలో మంగళవారం సైతం పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ జిల్లా నలుమూలల నుంచి బలగాలను దించుతున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.తునిలో మంగళవారం జనం గుమిగూడడం, ఆయుధాలతో సంచరించడాన్ని నిషేధిస్తూ కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు జారీ చేశారు. మరోపక్క తమ కౌన్సిలర్లను ఎన్నికకు హాజరుకాకుండా అడ్డుకుంటున్న వైసీపీ తిరిగి మంగళవారం ఎన్నిక నేప థ్యంలో చలో తునికి పిలుపునివ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే 10 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోవడం, మరికొందరు అదే దారిలో ఉండడంతో ఓడిపోతామనే భయంతో ఎన్నిక జరగకుండా ఎలాగైనా చూడాలని వైసీపీ భావిస్తోంది. ఈ వైసీపీ తీరునే టీడీపీ తప్పుబడుతోంది.



తుని మునిసిపల్ కార్యాలయం వద్ద టీడీపీ కౌన్సిలర్లను కౌన్సిల్ హాల్‌లోకి పంపుతున్న పోలీసులు



చైర్మన్ నివాసం వద్ద టీడీపీ నాయకులతో మాజీ మంత్రి రాజా వాగ్వాదం

'చలో తుని'కి అనుమతి లేదు..

చలో తునికి ప్రభుత్వపరంగా ఎటువంటి అనుమతులు లేవు. చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. సోమవారం జరగాల్సిన ఎన్నిక కోరం సరిపోకపోవడంతో మంగళవారానికి వాయిదా పడింది. కౌన్సిలర్లకు కావాల్సిన పోలీసు రక్షణ ఉంటుంది. స్వేచ్ఛ గా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ముందుకు రావాలి. - శ్రీహరిరాజు, పెద్దాపురం డీఎస్పీ

మాజీ మంత్రి రాజాపై కేసు

మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆయన అనుచరులపై కేసు నమోదు చేసినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ స్పష్టంచేశారు. తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలో కౌన్సిలర్లు ఓటు వేయకుండా అడ్డుకోవడంతో పాటుగా టీడీపీ నేత పోలిశెట్టి రామలింగేశ్వరరావుపై మాజీ మంత్రి దాడిశెట్టి రాజా దాడి చేయడంపై వచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. వైస్ చైర్మన్ ఎన్నికకు కౌన్సిలర్లు స్వచ్ఛందంగా ఓటు వేసేందుకు ముందుకు రావాలని, పోలీసు రక్షణ అవసరమైతే తుని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

వేలల్లో కోళ్లు మృత్యువాత!



- చెందుర్తిలో ఒక్కరోజే మరో 2 వేల కోళ్లు మృతి
- ఇప్పటివరకూ మరణించినవి 4,500 కోళ్లు
- బర్డ్‌ఫ్లూగా అనుమానం.. పరిశీలించిన పశుసంవర్ధకశాఖ జేడీ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తిలో కోళ్లు మరణిస్తూనే ఉన్నాయి. సోమవారం ఒక్కరోజే మరో రెండు వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఇప్పటివరకూ ఈ ఒక్క ఫారంలోనే 4,500 కోళ్లు మరణించాయి. ఇవి బర్డ్‌ఫ్లూ కారణంగానే చనిపోయినట్టు భావిస్తున్నారు. చెందుర్తిలోని పుష్కర కాలువ గట్టుపై ఉన్న బోనబోయిన కృష్ణకు చెందిన కోళ్ల ఫారంలో ఐబీ కంపెనీకి చెందిన 8 వేల కోళ్లను బ్యాచ్‌లుగా పెంచుతున్నారు. ఇందులో 1500 కోళ్లు శని, ఆదివారాల్లో చనిపోగా, సోమవారం ఒక్కరోజే 2వేల కోళ్లు మరణించాయి. అంతకుముందు మరో వెయ్యి కోళ్లు మృత్యువాతపడ్డాయి. భారీ స్థాయిలో కోళ్లు చనిపోతుండడంతో ఇవి బర్డ్‌ఫ్లూ కారణంగానే చనిపోతున్నట్టు భావిస్తున్నారు. ఇప్పటికే తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో బర్డ్‌ఫ్లూ కారణంగా వేల సంఖ్యలో కోళ్లు మరణించాయి. ఇదే రీతిలో ఇక్కడ మరణాలు సంభవిస్తున్నా ఇప్పటివరకూ అధికారులు మాత్రం ధ్రువీకరించడం లేదు. కాగా చెందుర్తి కోళ్లఫారంను జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రకాశరావు సోమవారం పరిశీలించారు. కోళ్ల మరణాలకు గల కారణాలపై ఆరా తీశారు. అసాధారణ వ్యాధి కారణంగా కోళ్లు చనిపోతున్నాయని, ఇవి ఇతర కోళ్లకు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన బయో సెక్యూరిటీ చర్యల గురించి వివరించినట్టు జేడీ తెలిపారు. చనిపోయిన కోళ్లను ప్రజాసంచారానికి దూరంగా గొయ్యి తీసి సున్నం, బ్లీచింగ్ వేసి పూడ్చి పెట్టాలని ఆదేశించినట్టు చెప్పారు. ఈ మరణాల గురించి ఎటువంటి భయాందోళనలు చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఉడికించిన మాంసం, కోడిగుడ్లు తినవచ్చని, వాటివల్ల ఎలాంటి అనారోగ్యం కలుగదని తెలిపారు. ఆయన వెంట గొల్లప్రోలు ఏరియా ప్రభుత్వ వైద్యశాల ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు, పశువైద్యాధికారి డాక్టర్ హిమజ తదితరులు ఉన్నారు

భోపాల్‌కు నమూనాలు

చనిపోయిన కోళ్ల నుంచి కాకినాడ ఏడీడీఎల్ ల్యాబ్ అధికారులు శాంపిల్స్ సేకరించారు. వీటిని భోపాల్‌కు పరీక్షలు నిమిత్తం ఒక పశువైద్యాధికారితో పంపుతున్నట్టు పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. అక్కడ నుంచి నివేదిక కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి వస్తుందని చెప్పారు. ఆ తర్వాతే అసలు వ్యాధి నిర్ధారణ అవుతుందని స్పష్టంచేశారు.



పిఠాపురం పట్టణ శివారులోని ఆర్వోబీ సమీపంలో ఖాళీగా ఉన్న కోళ్ల ఫారం

పిఠాపురంలోనూ ఇంతే..

పిఠాపురం, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని కోళ్లఫారాల్లో కోళ్లు కొద్దిరోజులుగా చనిపోతున్నాయి. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. పిఠాపురం పట్టణ శివారులోని చిత్రాడ ఆర్వోబీ సమీపంలో ఉన్న కోళ్ల ఫారంలో వందల సంఖ్యలో కోళ్లు మరణించాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కోళ్లఫారం పూర్తిగా ఖాళీ చేయించామని పశుసంవర్ధక శాఖ పిఠాపురం ఏడీ రమేష్‌చంద్ర సోమవారం తెలిపారు. పట్టణంలో ఉన్న కోళ్లఫారాలుతోపాటు కుమారపురం, చిత్రాడ తదితర గ్రామాల్లో కోళ్లు చనిపోతున్నట్టు చెబుతున్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ భావన, ఏడీసీ కేటీ సుధాకర్

సర్వేలపై మున్సిపల్ కమిషనర్లు, సిబ్బందికి శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీల్లోని సచివాలయాల పరిధిలో పూర్తిచేయాల్సిన ఆరు సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ ఆదేశించారు. ఎంఎస్‌ఎంఈ, మిస్సింగ్ సిటిజన్స్ ఇన్ హౌస్ హోల్డ్స్, జియో ట్యాగింగ్, నాన్ రెసిడెన్సీ ఇన్ ఏపీ, చిల్డ్రన్స్ విత వుట్ ఆధార్, డెత్ ఆడిట్ ఇలా పలు సర్వేలను పూర్తిచేయడంలో కాకినాడ నగరపాలక సంస్థ ముందంజలో ఉండగా కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, తుని, గొల్లప్రోలు తదితర మున్సిపాల్టీలు వెనుకబడ్డాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశాల మేరకు కాకినాడ కమిషనర్ భావన సూచనలతో ఆయా మున్సిపాల్టీల పరిధిలోని కమిషనర్లు, నోడల్ ఆఫీసర్లు, సచివాలయ సిబ్బందికి శిక్షణను కాకినాడ నగరపాక సంస్థ స్మార్ట్ సిటీ కార్యాలయంలో అదనపు కమినర్ కెటి సుధాకర్, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సర్వేలను పూర్తిచేయకపోవడానికి గల కారణాలను అడిగితెలుసుకుని, సర్వేను సకాలంలో పూర్తిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో శైలజ, అధికారులు పాల్గొన్నారు.


రైతులూ.. రైతు బజార్లో నేరుగా అమ్ముకోండి!

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కూరగాయ ధరలు తగ్గడంతో నష్టపోకుండా రైతుబజార్లలో నేరుగా రైతులు అమ్ముకునేలా చర్యలు చేపట్టినట్టు జిల్లా మార్కెటింగ్ ఏడీ కె.రాఘవేంద్రరావు తెలిపారు. టమాటా, కాయగూరల ధరలు తగ్గడంతో రైతులు నష్టపోకుండా వారి పంటలను నేరుగా విక్రయించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. రైతులు ఆయా రైతుబజార్లలో ఎస్టేట్ అధికారులను సంప్రదిస్తే సదుపాయాలు కల్పిస్తారని ఆయన చెప్పారు.

98 ఆటోలు సీజ్



కాకినాడ క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించే దిశగా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో నిబంధనలు అతిక్రమించిన ఆటోలపై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 98 ఆటోలను సీజ్ చేసి పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ డ్రైవ్‌ను కాకినాడ ట్రాఫిక్- 1, 2 పోలీస్‌స్టేషన్ల సీఐలు ఎన్ రమేష్, డి.రామారావు ఆధ్వర్యంలో జరిగింది. ఓవర్‌లోడ్ పాసింజర్స్, ఓవర్‌లోడ్ స్కూల్ చిల్డ్రన్, డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్ లేని ఆటోలు, ర్యాష్ డ్రైవింగ్, నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదాలకు కారణమవుతున్న ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్- 2 పోలీస్‌స్టేషన్‌లో అవగాహనా సదస్సుకు హాజరైన ఎస్పీ జి.బిందుమాధవ్ ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రైవర్లు అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి స్కూల్ పిల్లలను, పాసింజర్లను ఎక్కించరాదన్నారు. ఎవరైనా ఆటో డ్రైవర్లు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.



అగ్రిస్టాక్.. వేగవంతం

- కీలకం కానున్న భూఆధార్
- రైతులకు 11 అంకెల యూనిక్ నంబర్లు కేటాయింపు
- నెలాఖరు వరకూ పీఎం కిసాన్ లబ్ధిదారులకు గడువు
- ఈ గుర్తింపు కార్డుతో ప్రయోజనాలు ఎన్నో
- శరవేగంగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ఆధార్‌కార్డు అంటే మనుషులకు మాత్రమే ఉంది. ఇకపై భూములకు కూడా రానున్నాయి. అయితే ఈ భూ ఆధార్ ఎలా జారీ చేస్తారు, దీనివల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటనే ప్రశ్నలు ప్రతీ రైతులోనూ ఎదురవుతున్నాయి. వ్యవసాయ ఉన్నతాధికారులు అందిస్తున్న సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వం సాధారణ బడ్జెట్-2024లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూసంస్కరణలకు కీలక చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోని భూములకు యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్లు లేదా భూఆధార్, పట్టణ భూరికార్డుల డిజిటలైజేషన్ చేయాలని ప్రతిపాదించింది. రానున్న మూడేళ్లలో ఈ భూసంస్కరణలను పూర్తిచేయడానికి రాష్ట్రాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. దీనివల్ల భూమికి సంబంధించిన వివాదాలకు ఇకపై ఆస్కారం ఉండదు.

సామర్లకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అగ్రిస్టాక్ (ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్) రైతుల వివరాలు నమోదు ప్రక్రియ గత నాలుగు రోజులుగా జిల్లాలో వేగవంతమైంది. రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా అగ్రిస్టాక్‌లో రైతుల వివరాలను రిజిస్ట్రేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులకు అధికారికంగా ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి రిజిస్ట్రేషన్ చేయడంపై సమగ్రశిక్షణ ఇచ్చారు. ఆర్ఎస్‌కే సిబ్బంది తమ లాగిన్ ద్వారా రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 4.50 లక్షల పైబడి రైతులు ఉన్నారు. రైతులు ఆధార్, పట్టాదారుల పుస్తకం, ఆధార్‌తో లింకైన సెల్ నంబర్‌ను రైతు సేవా కేంద్రాలకు తీసుకెళ్లాలి. అక్కడి సిబ్బంది అగ్రిస్టాక్ వెబ్‌సైట్‌లో రైతుల వివరాలతో రిజిస్ట్రేషన్ చేస్తారు. తొలుత ఆధార్ వెరిఫికేషన్ కోసం ఒక ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత మొబైల్ వెరిఫికేషన్ కోసం మరో ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత ఈ-సైన్ కోసం మరో ఓటీపీ అడుగుతుంది. మూడు ఓటీపీలు పూర్తయిన తర్వాత రిజిస్ట్రేషన్ విజయవంతమైనట్టు రైతుసెల్ ఫోన్ నెంబరుకు మరో సంక్షిప్త సమాచారం అందుతుంది. ఆ మెసేజ్ వచ్చిన 48 గంటల తర్వాత 11 నంబర్లతో కూడిన యూనిక్ నంబరు మెసేజ్ ద్వారా వస్తుంది. ప్రజలకు ఆధార్ ఎంత ముఖ్యమో రైతులకు (ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబరు) ఈ యూనిక్ నంబరు అంతే ముఖ్యం. భవిష్యత్తులో రైతులకు సంబంధించిన అన్ని పథకాలను ఈ నంబరు ఆధారంగానే వర్తింపజేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.

ఆధార్ ఎలా పనిచేస్తుందంటే..

ప్లాట్ కచ్చితమైన భూగోళిక స్థానాన్ని గుర్తించడానికి మొదట జీపీఎస్ టెక్నాలజీని ఉపయోగించి జియోట్యాగింగ్ చేస్తారు. అప్పుడు సర్వేయర్లు ప్లాటు సరిహద్దులను భౌతికంగా ధ్రువీకరించి కొలుస్తారు. ప్లాట్ కోసం భూమి యజమాని పేరు, వినియోగవర్గం, విస్తీర్ణం వంటి వివరాలను సేకరిస్తారు. సేకరించిన వివరాలన్నీ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లో నమోదవుతాయి. ఈ సిస్టమ్‌లో ఆటోమెటిక్‌గా ప్లాట్ కోసం 14 అంకెల బీయు-ఆధార్ నంబరును జనరేట్ చేస్తుంది. ఇది డిజిటల్ రికార్డుతో లింక్ చేస్తారు. ఆధార్ కార్డు తరహాలో ఏర్పాటుచేసిన ల్యాండ్ బేస్‌లో స్టేట్‌కోడ్, డిస్ట్రిక్ట్ కోడ్, సబ్‌డిస్ట్రిక్ట్ కోడ్, విలేజ్‌కోడ్, ప్లాట్ యూనిక్ ఐడీ నంబరు మొదలైనవి ఉంటాయి. డిజిటల్, ఫిజికల్ ల్యాండ్ రికార్డ్ డాక్యుమెంట్‌లో బీయూ-ఆధార్ నంబరును డిజిటలైజ్ చేస్తారు. భూమిని బదలాయించినా, పలు భాగాలు విభజించినా, అందులో ఏమైనా మార్పులు జరిగినా ప్లాట్ భౌగోళిక సరిహద్దుకు భూమి-ఆధార్ నంబరు ఒకేలా ఉంటుంది.

భూ-ఆధార్ ప్రయోజనాలు

భూమి స్థాయి మ్యాపింగ్, కొలత ద్వారా కచ్చితమైన భూరికార్డులను నిర్ధారిస్తుంది. ప్లాట్ గుర్తింపులో అస్పష్టతను తొలగిస్తుంది. తరచుగా వచ్చే భూవివాదాలకు చెక్ పడనుంది. ఆధార్‌తో అనుసంధానించడం ద్వారా ఆన్‌లైన్‌లో భూరికార్డులు సులభతరంగా ఉంటాయి. ప్లాట్‌కు సంబంధించిన మొత్తం చరిత్ర, యాజమాన్య వివరాలను ట్రాక్ చేయవచ్చు. విధాన రూపకల్పన కోసం ప్రభుత్వం కచ్చితమైన భూమి డేటాను పొందుతుంది. రైతులకు యూనిక్ నంబరు తప్పనిసరి, ఎన్.విజయకుమార్, కాకినాడ జిల్లా వ్యవసాయాధికారి ఫార్మర్ రిజిస్ట్రేషన్ యూనిక్ నంబరు రైతులకు తప్పనిసరి. జిల్లాలోని రైతులందరూ స్థానిక రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి యూనిక్ నంబరు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ ఫోన్ నంబరును రైతులు తీసుకువెళ్లాలి. ఈనెలాఖరులోగా పీఎం కిసాన్ లబ్ధిదారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. భవిష్యత్తులో ఈ నంబరు ఆధారంగానే అన్ని రకాల లబ్ధి పీఎం కిసాన్, పంటలబీమా, పంటనష్ట పరిహారం మంజూరు, అన్నదాతా సుఖీభవ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ పథకాలు వర్తింపజేసేందుకు ఈ 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలకంగా తీసుకునే యోచన చేస్తున్నాయి. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సోమవారం సాయంత్రం నాటికి కాకినాడ జిల్లాలో 1,34,600 మంది రైతులకు గాను ఆధార్ నమోదు ప్రక్రియ 84,273 మంది రైతులకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. రైతుల్లో చైతన్యం వచ్చి అందరూ రిజిస్ట్రేషన్లు పూర్తిచేసుకోవాలి.

ఈనెల 21న పెన్షన్ అదాలత్

కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో ఈనెల 21వ తేదీన పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పెన్షన్, జీపీఎఫ్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు వివరాలతో హాజరుకావాలని సూచించారు.

కన్సల్టేటివ్ కమిటీల సభ్యునిగా సతీష్‌బాబు నియామకం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు కన్సల్టేటివ్ కమిటీల సభ్యునిగా నియతులయ్యారు. ఈ మేరకు ఆయా సంస్థలు, శాఖల నుంచి ఎంపీ సతీష్‌బాబుకు నియామక ఉత్తర్వులు అందాయి. దక్షిణ మధ్య రైల్వే జోనల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్ సలహా మండలి కమిటీ సభ్యునిగా, పెట్రోలియం సహజవాయువు మంత్రిత్వశాఖ సలహా మండలి సభ్యునిగా, స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ ప్రైన్యూర్‌షిప్ మంత్రిత్వశాఖ హిందీ సలహాకార్ సమితి సభ్యునిగా నియమితులయ్యారు.


పురుషుల విభాగంలో హోరాహోరీగా జరుగుతున్న మ్యాచ్


మహిళల విభాగంలో...

నువ్వా...నేనా!

కాకినాడలో మూడో రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు సోమవారం మూడో రోజుకు చేరుకుంది. మహిళలు, పురుషుల విభాగాల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. మహిళల విభాగంలో ఒడిశా సెక్రటేరియట్, హర్యానా సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 8-0 తేడాతో గెలుపొందింది. ఉత్తరాఖండ్, ఢిల్లీ తలపడగా ఉత్తరాఖండ్ టీమ్ 4-0 తేడాతో గెలుపొందింది. బిహార్, తెలంగాణ జట్ల మధ్య జరిగిన పోరులో బిహార్ 15-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఛత్తీస్‌గఢ్ జట్లు తలపడగా సెంట్రల్ సెక్రటేరియట్ 7-0 తేడాతో గెలు పొందింది. రాజస్థాన్ సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ నడుమ జరిగిన సమరంలో మధ్యప్రదేశ్ టీమ్ 2-0 తేడాతో పైచేయి సాధించింది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ టీమ్ 11-0 తేడాతో గెలుపొందింది.

పురుషుల విభాగంలో.... ఆర్ఎస్బీ చెన్నై, ఆర్ఎస్బీ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ చెన్నై టీమ్ 6-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ అహ్మదాబాద్, ఆర్ఎస్బీ ఇండోర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్లు 2-2 గోల్స్ నమోదు చేయడంతో డ్రా అయ్యింది. ఆర్ఎస్బీ హైదరాబాద్, ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ హైదరాబాద్ 6-0 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ జి.భానుమూర్తిరాజు ముఖ్య అతిథిగా హాజరు కాగా సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు దేవులనాయక్, డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.



ఇండియా తరపున ఆడుతున్నందుకు

గర్వపడుతున్నా

సోనికా

ఏషియన్ గేమ్స్ హాకీ గోల్డ్ మెడలిస్ట్, ఢిల్లీ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్

ఇండియా తరపున హాకీ టీమ్‌లో ఆడుతున్నందుకు ఎంతో గర్వపడుతున్నాను. 2022 కామన్‌వెల్త్ గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్, అదే సంవత్సరం ఏషియన్ గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాను. 2023లో జరిగిన చాంపియన్‌షిప్‌లో ఇండియా టీమ్‌లో మిడ్ ఫీల్డర్‌గా ఆడాను. ఆ గేమ్స్‌లో ఇండియా మొదటి స్థానంలో నిలవడంతో గోల్డ్ మెడల్ సాధించాము. ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి కాకినాడ వచ్చి ఆడుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి




క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏపీ స్కూల్ గేమ్స్ సెక్రటరీ భానుమూర్తి రాజు, పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు దేవులనాయక్. చిత్రంలో డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు

క్రీడాకారులకు ప్రోత్సాహకాలు


ఏషియన్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ సోనికాకి బహుమతి అందజేస్తున్న కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి విచ్చేసిన ఏషియన్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ సోనికాని కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవిచంద్ర ప్రసాద్ కడియాల సోమవారం సత్కరించారు. ఆమెకు బహుమతి అందించారు. అంతర్జాతీయ హాకీ ఒలింపిక్స్ చాంపియన్‌షిప్‌కి ప్రిపేర్ అవుతున్న అర్జున అవార్డు గ్రహీత మహమ్మద్ రియాజ్ కుమార్తె సమీనా రియాజ్‌కు ప్రోత్సాహకంగా రూ.లక్ష చెక్కు అందజేశారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన నేషనల్ గేమ్స్‌లో జిమ్నాస్టిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారునికి రూ.25వేలు చెక్కును క్లబ్ తరపున అందించారు. కార్యక్రమంలో ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్ టీం హెడ్ కోచ్ రాజ్‌కుమార్ వర్మ, కోచ్ రవిచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చాలా తక్కువ సమయంలో ఏర్పాట్లు చేశాం

బి.శ్రీనివాస్‌కుమార్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, కాకినాడ జిల్లా



ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి చాలా తక్కువ సమయంలో ఏర్పాట్లు పూర్తిచేశాం. కలెక్టర్ షాన్‌మోహన్ చొరవతోనే గేమ్స్ ఇక్కడ జరగడానికి అవకాశం దక్కింది. 20 రోజులు ముందే అనుమతి రావడంతో కలెక్టర్ చైర్మన్‌గా 13 కమిటీలు వేశాము. ప్రతి కమిటీలో ఒక చైర్మన్‌తో పాటు సభ్యులు నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ కమిటీలను జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తుండగా డీఆర్వో వెంకటరావు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. 25 నుంచి లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ రోజు నుంచే నాకౌట్ మ్యాచ్‌లు మొదలవుతాయి. 26న క్వార్టర్ ఫైనల్, 27న సెమీఫైనల్, 28న ఫైనల్‌తో పాటు క్వార్టర్ ఫైనల్స్ సెమీ ఫైనల్‌లో రెండు ప్లేస్‌ల్లో నిలిచిన రెండు జట్ల మధ్య మూడో స్థానం కోసం మ్యాచ్ ఉంటుంది. క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా చూసేందుకు సుమారు 200 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. దేశంలోని అతిపెద్ద టోర్నమెంటు కాకినాడలో జరగడం సంతోషించాల్సిన విషయం. మెడల్స్ సాధించిన వారికి ఆయా డిపార్ట్‌మెంట్స్ నుంచి ఉద్యోగోన్నతులు, ఇంక్రిమెంట్లు కూడా ఇస్తారు. 22 కంపెనీల స్పాన్సర్‌షిప్‌తో టోర్నమెంటును ఘనంగా నిర్వహిస్తున్నాము.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి

వైభవంగా శివకేశవుల ప్రతిష్ఠోత్సవం

- ఇర్రిపాకలో ఆధ్యాత్మిక శోభ
- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు


శివకేశవుల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జగ్గంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఏలేరు నదీ తీరాన శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ-మణి దంపతులు కర్తలుగా పాల్గొనగా ప్రసన్న వేంకటేశ్వర స్వామి, కోటిలింగేశ్వరుడు విగ్రహాల ప్రతిష్ఠ కుమ్మరిలోవ తపోవనం పీఠాధిపతి సచ్చిదానందస్వామి, శృంగేరీ పీఠం ఆంధ్ర-తెలంగాణ ప్రచారకర్త బంగారయ్యశర్మ, శృంగేరీ పీఠం వారణాసి ఇన్‌చార్జి ఇంద్రగంటి సత్యం, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ జరిగింది. జ్యోతుల నవీన్-లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు-సునీత దంపతులు, జ్యోతుల నెహ్రూ మనవడు అనీష్ నెహ్రూ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, దాట్ల బుచ్చిబాబు, వరుపుల సత్యప్రభ, టీటీడీ పాలక మండలి సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, బెంగళూరు దర్శన్, కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు, ఎస్వీఎస్ఎన్ వర్మ, మాజీ ఎమ్మెల్సీలు చిక్కాల రామచంద్రరావు, ఆదిరెడ్డి అప్పారావు, చైతన్యరాజు, అనంత ఉదయభాస్కర్, టీడీపీ నేత వానిరెడ్డి ఏసుదాసు, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ ఇన్‌చార్జి వర్మ, రాజమహేంద్రవరం మాజీ మేయర్ ఆదిరెడ్డి వీర రాఘవమ్మ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల బాబు, సూరంపాలెం బాలు, ఎల్లపు దొరబాబు, మాదారపు వీరబాబు, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మొగిలి గంగాధర్, తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా, గోకేడ ప్రసాద్, కర్నాకుల సూరిబాబు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. వచ్చిన వారంతా శివకేశవులను దర్శించుకుని అన్న, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


వేంకటేశ్వర స్వామికి హారతి


ప్రతిష్ఠ జరిపిస్తున్న తపోవనం సచ్చిదానంద స్వామి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ఈఎస్ఐ ఆసుపత్రి తనిఖీలో కార్మిక శాఖ మంత్రి సుభాష్
- హాజరుపట్టీ పరిశీలన... రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా
- విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు చార్జ్ మెమోలు ఇవ్వాలని ఆదేశం


ఈఎస్ఐ ఆసుపత్రిలో ఉద్యోగుల హాజరును పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం చూపితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు విభాగాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరుపట్టీని పరిశీలించిన ఆయన విధులకు గైర్హాజరైన ఉద్యోగుల వివరాలపై ఆరా తీశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, మరికొంతమంది సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు ఛార్జ్ మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పారిశుధ్య నిర్వహణ, సిబ్బంది రోగుల పట్ల అనుసరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసి భారీగా నిధులు కేటాయిస్తోందని, ఇందులో భాగంగా రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాగానే రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు త్వరలోనే సమకూరుతాయని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

పండ్ల గిడ్డంగిలో భారీ అగ్ని ప్రమాదం

- దివాన్‌చెరువు ఫ్రూట్స్ మార్కెట్‌లో ఘటన
- గొడౌన్‌లో చెలరేగిన మంటలు
- పలు రకాలు పండ్లు సహా రెండు బైకులు దగ్ధం
- మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది


మంటల్లో కాలిపోతున్న గొడౌన్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని పండ్ల మార్కెట్‌లో ఓ గొడౌన్ అగ్నికి ఆహుతైంది. దివాన్‌చెరువు పండ్ల మార్కెట్‌లో ఇనుప రేకులతో వేసిన ఆరాధ్యుల శ్రీనివాసరావు(ఏఎస్ఆర్)కు చెందిన పండ్ల గిడ్డంగిలో సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో లోపల ఉన్న ప్లాస్టిక్ ట్రేలు అంటుకుని అమ్మకం కోసం నిల్వచేసిన ఆపిల్, దానిమ్మ, కర్బూజ, డ్రాగన్ తదితర రకాల పండ్లు కాలిపోయాయి. వాటితోపాటు సమీపంలోని పండ్ల దుకాణంలో ఉంచిన రెండు బైకులు కాలిపోయాయి. స్థానికులు రాజమహేంద్రవరంలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఈ.స్వామి, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్‌తో బాటు ఆర్యాపురం, ఇన్నీసుపేట, కొవ్వూరుల నుంచి మూడు అగ్నిమాపక శకటాలు ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.10 లక్షలు విలువ చేసే పండ్లు, 15 వేల ట్రేలు, గిడ్డంగి దగ్ధమయ్యిందని, సుమారు రూ.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు శ్రీనివాసరావు చెప్పారు. కాగా కాల్చి పడేసిన సిగరెట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నామని, ఆస్తి నష్టం సుమారు రూ.25 లక్షలు ఉండొచ్చని అగ్నిమాపక శాఖాధికారులు చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, వైసీపీ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్, డీఎస్పీ భవ్య, బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్ పరిశీలించారు. గిడ్డంగి యజమాని, అగ్నిమాపక అధికారులను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. బాధితుడితో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని అన్నారు. పండ్ల గిడ్డంగిలో ప్రమాదం మానవ తప్పిదం వల్లే జరిగిందన్నారు.

కాకినాడ ఆర్ఎంసీలో

నేడు, రేపు మాక్ డ్రిల్

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో మంగళ, బుధవారాల్లో తీవ్రవాద చర్యల నిరోధక సంస్థ ఆక్టోపస్ మాక్‌డ్రిల్ నిర్వహించనుంది. 2రోజుల పాటు జరిగే ఈ మాక్‌డ్రిల్‌లో ఆకస్మికంగా టెర్రరిస్టులు దుశ్చర్యలకు పాల్పడితే తిప్పికొట్టే చర్యలపై శిక్షణనివ్వనున్నారు. మాక్‌డ్రిల్ నిర్వహించడంతో పాటు రెక్కీ నిర్వహించాల్సిన విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నారు.

ప్రేమించి.. పెళ్లి చేసుకోనని..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లికి ముఖం చాటేయడంపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పిడింగొయ్యికి చెందిన ఎల్.కుమార్ మత్స్యకార వలల వ్యాపారం చేస్తుంటాడు. మూడేళ్ల క్రితం షెల్టాన్ హోటల్ సమీపంలోని ఓ యువతితో పరిచయం ఏర్పడింది. అయితే తాము అప్పటి నుంచీ ప్రేమించుకుంటున్నామని, పెళ్లి విషయం వచ్చేసరికి అతడు ఒప్పుకోవడం లేదని యువతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్త సందోహం

- ఘనంగా వీరభద్రుడి సంబరం
- వేళంగికి పోటెత్తిన భక్తులు


వేళంగిలో భారీ జనసందోహం నడుమ వీరభద్రుడి ఊరేగింపు

కరప, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో సోమవారం వీరభద్రుడి సంబరం ఘనంగా జరిగింది. రెండేళ్లకోసారి మాఘమాసం మూడో సోమవారంనాడు దాలిపర్తి గోవిందు కుమారులు ఈ వీరభద్రుడి సంబరాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తజనం తరలిరాగా కుమ్మర్ల గద్దె నుంచి స్వామివారిని ఊరేగించారు. చెరువుగట్టు మీద జమ్మిపూజ చేసిన అనంతరం సంప్రదాయాలను అనుసరించి తలపై వీరభద్రుడి ప్రతిమలను పెట్టుకుని ప్రభలతో తిరిగి గద్దెకు చేరుకున్నారు. వీరభద్రుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తదనంతరం భారీ అన్నసంతర్పణ, రాత్రికి సంబరం జరిగింది. వీరభద్రుడి ఊరేగింపు సందర్భంగా వేళంగి ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కరప పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాలను మళ్లించడంతో పరిస్థితి చక్కబడింది.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్ట్

ప్రధాన నిందితుడు పరారీ

కోరుకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గంజాయిని సేకరించి విక్రయాల కోసం విభజించుకుంటుండగా పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి సుమారు రెండు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ సోమవారం సాయంత్రం తెలిపారు. కోరుకొండ మండలం జంభూపట్నం పంచాయతీ పరిధిలో అయ్యన్నగళ్ల సమీపంలోని రోమ్ సిటీ వద్ద ఐదుగురు వ్యక్తులు ఒక గంజాయి మూటతో ఉండగా వారిని విచారించి సోదా చేయగా వారి వద్ద సుమారు 2 కిలోల గంజాయి లభించిందన్నారు. కోరుకొండకు చెందిన గంటివాడ లోవరాజు, గోకరకొండ నరేంద్ర, కామిశెట్టి చరణ్‌కుమార్, శ్రీరాంపురం గ్రామానికి చెందిన గోలుకొండ చంద్రదుర్గ, శ్రీరంగపట్నానికి చెందిన నడిపల్లి అంజిసాయిలను అరెస్ట్ చేశామన్నారు. ప్రధాన నిందితుడు, జంభూపట్నం గ్రామానికి చెందిన కాళ్ల నరేష్ పరారీలో ఉన్నాడని డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ డీవీఎస్ఎస్ శ్యామ్‌సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించేందుకే ‘చలో తుని’కి పిలుపు



తుని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కూటమి నాయకులు

- తుని మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాపై కూటమి నాయకుల ధ్వజం

తుని రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన తునిలో అల్లర్లు సృష్టించేందుకే వైసీపీ నాయకుడు దాడిశెట్టి రాజా చలో తునికి పిలుపునిచ్చాడని కూటమి నేతలు ధ్వజమెత్తారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ పోలీసులు వచ్చి ఎన్నికలు సజావుగా జరగాలని ప్రయత్నిస్తే వారిపై ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నావని నిలదీశారు. వైసీపీ కౌన్సిలర్లను టీడీపీ నేతలు కిడ్నాప్ చేయలేదని, వారిని దాడిశెట్టి రాజాయే కిడ్నాప్ చేశారంటూ వారి కుటుంబసభ్యులు తమ వద్దకు వచ్చి గోడు వెలిబుచ్చుకుంటున్నారని తెలిపారు. కాపులపై కేసులు పెట్టించింది సీఐ చెన్నకేశవరావు కాదని, మీ పక్కనే ఉన్న యనమల కృష్ణుడని గుర్తుచేసుకోవాలని కోరారు. ప్రశాంతంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు సహకరిస్తే తుని మున్సిపల్ వైస్‌చైర్మన్ పదవి టీడీపీ ఖాతాలో పడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యనమల రాజేష్, తుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు యిని గంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, బోనం చినబాబు, తమరాన సత్యనారాయణ, గంటల సత్యనారాయణ పాల్గొన్నారు.

‘చలో తుని’కి రండి.. జయప్రదం చేయండి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైసీపీ కార్యకర్తలకు కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపు

తుని రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చలో తుని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సోమవారం తునిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కౌన్సిలర్లను టీడీపీ నాయకులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, తాను వచ్చి అడ్డుకున్నానని అన్నారు. 17మంది కౌన్సిలర్లతో సంతకాలు చేసి ఎన్నికల అధికారికి అందజేశామని, నేడు జరిగే ఎన్నికలో కలెక్టర్, ఎస్పీ సమక్షంలో ఎన్నికకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ పార్టీ నాయకుడు యనమల కృష్ణుడు మాట్లాడుతూ అసలు తునిలో ప్రజాస్వామ్యం ఉందా అంటూ ప్రశ్నించారు. మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణితోపాటు పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారు.

క్షణికావేశంలో భర్తపై దాడి

- కూలి డబ్బుల విషయమై భార్యభర్తల మధ్య వివాదం
- భార్యపై దాడి చేయబోయిన భర్త
- తప్పించుకుని భర్తపై కత్తితో దాడి చేసిన భార్య
- ఆపై అతడ్ని ఆస్పత్రిలో చేర్చిన వైనం
- శంఖవరం మండలం పెదమల్లాపురంలో ఘటన



గాయపడిన దానేశ్వరరావు

శంఖవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తనపై కత్తితో దాడి చేసేందుకు వస్తున్న భర్తను ఆపి.. అదే కత్తితో భార్య తిరిగి నరికింది. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి ఆమె వెంటనే ఆస్పత్రికి తరలించింది. కాకినాడ జిల్లా శంఖవరం మండలం పెదమల్లాపురంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెదమల్లాపురానికి చెందిన తిన్నింటి దానేశ్వరావుకు, భార్య సన్యాసమ్మ దంపతులు. వీరి మధ్య సోమవారం కూలి డబ్బుల విషయంలో మాటామాటా పెరిగింది. కష్టపడి సంపాదించిన డబ్బుతో మద్యం తాగేస్తుండడంపై భర్తను ఆమె గట్టిగా నిలదీసింది. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. ఈ ఘటనలో భార్యపై భర్త కత్తితో దాడికి తెగబడబోయాడు. ఈ సమయంలో ఆమె ఆ కత్తి లాక్కొని భర్త పీకపై సన్యాసమ్మ ఒక్కవేటు వేసింది. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి ఆమె వెంటనే స్థానికుల సహాయంలో అంబులెన్సుకు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించి దగ్గరుండి వైద్యం చేయించింది. కాగా, ధానేశ్వరరావుకు ఏ ప్రమాదం లేదని, దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదని, ప్రాథమిక విచారణ చేస్తున్నామని అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బైక్‌లు

- భర్త మృతి.. భార్యకు గాయాలు
- మడికి-దుళ్ల రహదారిలో ఘటన

ఆలమూరు/కడియం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో భర్త మృతిచెందగా భార్యతోపాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన గంటా రాజు(27), అతడి భార్య కుమారి కొత్తపేట మండలం మందపల్లిలో ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరు మడికి- దుళ్ల రోడ్డులోకి వచ్చేసరికి వీరి వాహనాన్ని మరో మోటారుసైకిల్ ఢీకొంది. దీంతో రాజు, కుమారిలకు తీవ్రగాయాలవ్వగా రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వేరే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌లో ఎక్కించేలోపు రాజు మృతిచెందగా కుమారి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా రాజు దంపతులకు ఏడాది వయస్సు ఉన్న ఓ కుమార్తె ఉంది. అతడు కేశవరంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని స్థానికులు తెలిపారు. దీనిపై ఆలమూరు ఎస్‌ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్రేయపురం పూతరేకుల కేంద్రాలపై..

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

- 160 కిలోల కల్తీనెయ్యి స్వాధీనం
- పూతరేకులు, నెయ్యి శాంపిల్స్ పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు..
- ఫుడ్‌సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు



ఆత్రేయపురంలో కల్తీనెయ్యి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నకల్తీనెయ్యి షాపులపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ఆత్రేయపురంలో తయారు చేస్తున్న పూతరేకుల్లో విచ్చలవిడిగా కల్తీనెయ్యి వాడుతున్నారనే ఆరోపణలపై రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ కమిషనరు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫుడ్‌సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు రొక్కయ్య, సుబ్బారావు, ప్రసాద్, శ్రీకాంత్‌చౌదరిల బృందం ఏకకాలంలో వేర్వేరుగా కల్తీనెయ్యి అమ్ముతున్న షాపులు, పూతరేకుల తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. పూతరేకుల్లో కల్తీనెయ్యి వాడుతున్నారని తద్వారా ప్రజల ఆరోగ్యం గుల్లవుతుందన్న ఆరోపణలపై ఈ బృందం దాడులు నిర్వహించింది. ఆత్రేయపురం, రేవు సెంటర్‌ల్లో వివిధ షాపులపై దాడులు చేశారు. డ్రైఫ్రూట్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహించగా ప్లాస్టిక్‌కవర్లలో ఏ కంపెనీ బ్రాండ్లు లేని కల్తీ నెయ్యిగా అనుమానించిన 160కిలోల నాసిరకం నెయ్యిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పూతరేకుల తయారీ కేంద్రంలో పూతచుట్టలను సీల్డ్‌కవర్లలో భద్రపరిచారు. నెయ్యి, పూతరేకులను హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం పంపిస్తున్నట్లు తద్వారా వచ్చే రిపోర్టు ఆధారంగా షాపులు, ఆయా వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు చేపడతామని కంట్రోలర్ శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు షాపులపై దాడులు నిర్వహించారు.

ఆరోగ్యాలపై చెలగాటం ఆడితే చర్యలు

కల్తీ నెయ్యి తయారు చేస్తున్న స్వీట్లను ప్రజలకు అమ్మితే చట్టప్రకారం చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ శ్రీనివాస్ హెచ్చరించారు. పూతరేకుల్లో కల్తీనెయ్యి వాడుతున్నారని వచ్చిన ఫిర్యాదులపై ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఆరోగ్యాలను కాపాడుకోవాలని, బ్రాండ్లు లేని నెయ్యితో పూతరేకులు తయారు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుడ్ లైసెన్సు తీసుకుని ప్రతి షాపులో తప్పనిసరిగా ప్రదర్శించాలని, నాణ్యత ప్రమాణాలతో అమ్మకాలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం 8 శాంపిల్స్ సేకరించామని, 160 కిలోల నాసిరకంగా నెయ్యిగా అనుమానించి స్వాధీనం చేసుకుని భద్రపరిచామన్నారు. ల్యాబ్‌కు పంపిన నివేదిక ఆధారంగా చర్యలు తప్పవన్నారు. త్వరలోనే మరిన్ని దాడులు చేపడతామన్నారు.

బాలిక కిడ్నాప్.. ఆపై అత్యాచారం

- ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో కేసు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంమండలం అనాతవరంలో 8వ తరగతి చదువుతున్న 15ఏళ్ల బాలికను ఓ వ్యక్తి కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. దీనికి సంబంధించి ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన వివాహితుడు పరమట దుర్గాప్రసాద్ అలియాస్ బులిచంటి సోమవారం స్కూల్‌కు వెళ్తున్న బాలికను మాయమాటలు చెప్పి బలవంతంగా మోటారుసైకిల్‌పై ఎక్కించుకుని కిడ్నాప్ చేశాడని, ఆమెను అమలాపురం వైపు తీసుకువెళ్లి అక్కడఒక నివాసగృహంలో ఆమెపై అత్యాచారంచేశాడని తెలిపారు. బాలిక స్కూలుకు రాకపోవడం, ఓ వ్యక్తి మోటారుసైకిల్‌పై తీసుకువెళ్లిన విషయాన్ని తోటి విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సమాచారం అందించారు.ఆయన విద్యార్థిని తండ్రికి ఫోన్‌లో విషయాన్ని తెలియచేశారు. దీంతో విద్యార్థిని తండ్రి విషయాన్ని ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ జ్వాలాసాగర్ గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటికే నిందితుడు దుర్గాప్రసాద్ అమలాపురం ఎర్రవంతెనవద్ద బాలికను బస్సు ఎక్కించి పరారయ్యాడు. ఈ మేరకు ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బాలికపై ఆటోడ్రైవర్ అత్యాచారం

- మండపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు

మండపేట, ఫిబ్రవరి, 17(ఆంధ్రజ్యోతి) మండపేటలో పదో తరగతి బాలికపై ఓ ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. మండపేట పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట పట్టణంలోని గొల్లపుంతకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ క్రాంతికుమార్(25)కు భార్య, కుమారుడు ఉన్నారు. మండపేట పట్టణంలోనే పదో తరగతి చదువుతున్న ఓ బాలికతో అతడికి పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ సురేష్ విలేఖరులకు తెలిపారు.

టిప్పర్ ఢీకొని తోడికోడళ్లు మృతి

- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు
- రాజానగరం మండలం దివాన్‌చెరువులో ఘటన



సంఘటనా స్థలంలో రిబ్కా, చంద్రం మృతదేహాలు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కూలిపనికి వెళ్లి ఓ వ్యక్తి మోటారుసైకిల్‌పై వస్తుండగా టిప్పర్ ఢీకొన్న ఘటనలో తోటికోడళ్ల మృతి చెందిన ఘటన విషాదం నింపింది. జాతీయ రహదారిపై బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌పరిధిలోని దివాన్‌చెరువులో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన కప్పల రిబ్కా(50), కప్పల చంద్రం(49) ఇదే మండలంలోని పాలచర్ల రోడ్డులోని నర్సరీలో కూలి పనికి వెళ్లారు. పని ముగించుకుని నాగేశ్వరరావు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై రాజానగరం వైపు వెళ్తున్నారు. వీరు దివాన్‌చెరువులోని పండ్ల మార్కెట్ వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి వస్తున్న టిప్పర్ ఢీకొని వీరిపైనుంచి వెళ్లిపోవడంతో రిబకా, చంద్రం అక్కడికక్కడే మృతి చెందారు. నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బొమ్మూరు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

రైళ్ల రాకపోకల సమాచారం ఏదీ



సామర్లకోటలో పాత రైళ్ల రాకపోకలు టైం టేబులు

సామర్లకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో అత్యధిక ఆదాయం రైలు ప్రయాణికుల ద్వారా సామర్లకోట జంక్షన్ రైల్వేస్టేషన్‌లో లభిస్తున్నా ఆ రీతిలో ప్రయాణికులకు రైళ్ల రాకపోకల సమాచారం సైతం స్పష్టంగా ప్రకటించడంలేదు. సామర్లకోట స్టేషన్‌కు నిత్యం విజయవాడ, విశాఖల వైపు 66 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. వాటి రాకపోకల సమాచారాన్ని తెలియపరిచే టైంటేబులులో గత రెండేళ్ల క్రితం (1.10.2023) నాటి సమయాలు నేటికీ మార్చకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బుకింగ్ కార్యాలయంలో ప్రయాణికులు ఆయా రైళ్ల రాకపోకలకు సంబంధించి సమాచారం అడిగితే చిరుబురులాడుతుంటారు. ఇదే విషయమై ఇటీవల రైల్వే డీఆర్ఎం అధికారి నరేంద్ర ఆనందరావు పాటిల్ సామర్లకోట పర్యటనకు విచ్చేసినపుడు పలువురు ప్రయాణికులు టైంటేబులు దుస్థితిపై ఫిర్యాదు చేయగా మరుసటి రోజే మార్పులు చేయాలని సదరు డీఆర్ఎం సిబ్బందిని ఆదేశించారు. 15 రోజులు గడుస్తున్నా నేటికీ అదే టైంటేబులు ఉండడంపట్ల రైల్వే అధికారుల్లో మార్పులు వచ్చేదెన్నడోనని ఆందోళన చెందుతున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గండేపల్లి మండలం మల్లేపల్లిలో ఘటన

గండేపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కొనుగోలుకు తల్లిని అడిగితే డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన ఎడ్ల సామేలు(30) వివాహమై భార్యతో కలిసి వేరు కాపురం ఉంటున్నాడు. మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా తిరుగుతున్నాడు. ఈనెల 16న తల్లి దగ్గరకు వెళ్లి సెల్‌ఫోన్ కొనుక్కోవడానికి డబ్బులు అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో గడ్డి మందుతాగాడు. అతడిని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ కలెక్టరేట్‌లో దళిత మహిళ ఆత్మహత్యాయత్నం

- వైసీపీ నాయకులు తమ భూమి కబ్జా చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు
- వెంటనే బయటకు వచ్చి పురుగుల మందు తాగిన మహిళ
- జీజీహెచ్‌కు తరలించిన సిబ్బంది



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీదేవి

కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో దళిత మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వైసీపీ నాయకులు తమ భూమిని తప్పుడు డాక్యుమెంట్లతో కబ్జా చేశారని ఆమె ఆరోపించారు. సోమవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చి బయటకు వచ్చిన తర్వాత ఆమె పురుగుల మందు తాగింది. వెంటనే కలెక్టరేట్ సిబ్బంది ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతోంది. కాకినాడ పేర్రాజుపేటకు చెందిన మందపల్లి శ్రీదేవి సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసింది. తన భూమిని వైసీపీ నాయకులు గుర్రాల అనిల్‌కుమార్, గుర్రాల నాగేంద్రప్రసాద్, నల్లమిల్లి వెంకటరామిరెడ్డి తప్పుడు డాక్యుమెంట్లతో ఆక్రమించారని ఆరోపించారు. దీంతో కలెక్టర్ స్పందించి ఆ వివరాలను జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు పంపించారు. దీనిపై విచారణ చేయాలని ఆదేశించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని ఆమె తీవ్ర ఆవేదన చెందుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ మేరకు ఆమె కుటుంబసభ్యుడు మందపల్లి హరి అనే వ్యక్తి విలేకరులకు పలు విషయాలు వివరించాడు. గత ప్రభుత్వ హయాంలో కాకినాడ నగరంలో వైఎస్ఆర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో తమ భూమిని కోల్పోయామన్నారు. ఆ భూమికి బదులుగా ప్రభుత్వం దగ్గర్లోని పేర్రాజుపేటలో తమ ముగ్గురు అన్నదమ్ములకు కలిపి 200 గజాలు పట్టా ఇచ్చిందన్నాడు. 2021 నుంచి వైసీపీ నాయకులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆస్థలాన్ని కబ్జా చేయడానికి బెదిరిస్తున్నారని తెలిపాడు. దీనిలో కొంత మేర తమకు తెలియకుండా విక్రయించారని ఆరోపించాడు. సర్వేనెంబరు 91/1, టీఎస్ నెంబర్ 150/1లో తమ పట్టాభూమి ఇచ్చారని తెలిపాడు. వైసీపీ నాయకులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడమే కాకుండా కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్లు తెచ్చారన్నాడు. ఈ నేపథ్యంలో టూటౌన్ పోలీసుల ద్వారా తమను ఇళ్లు ఖాళీ చేయించేందుకు బెదిరిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో వారివల్లే తన భర్త మందపల్లి రాజు ఆత్మహత్య చేసుకుని మృతి చెందారని శ్రీదేవి ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో ఆమె పేర్కొన్నారు. తమను అధికారులే రక్షించాలని కోరారు. దీనిపై కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర మాట్లాడుతూ ఈ వివాదంపై తమకు ఫిర్యాదు రాగా విచారణ చేస్తున్నామన్నారు. వివాదాలు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో రెండు వర్గాలను బైండోవర్ చేసినట్టు తెలిపారు.

14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ వేడుకలు

- అదే రోజు భారీ బహిరంగసభ
- గతంలో మూడురోజులు నిర్వహించాలని ప్రతిపాదన
- తాజాగా ఒకరోజుకే పరిమితం

పిఠాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు మార్చి 14న పిఠాపురంలో నిర్వహించనున్నారు. గతంలో మూడురోజులపాటు ప్లీనరీసమావేశాలు నిర్వహించాలని భావించినప్పటికీ తాజాగా దాన్ని మార్పు చేస్తూ ఒకరోజుకే పరిమితం చేశారు. అదే రోజు పిఠాపురంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. జనసేన పార్టీ ఆవిర్భవించి దశాబ్దకాలం పూర్తయిన సందర్భంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని గతంలో భావించారు. ఇందుకుగాను తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో మూడురోజులపాటు ప్లీనరీ సమావేశాలు నిర్వహించి చివరిరోజున బహిరంగ సభ ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భావించారు. ఇందుకోసం ఆ పార్టీ నాయకులు అనువైన ప్రాంతాలకోసం పరిశీలన జరిపారు. పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్‌రోడ్డుతోపాటు 216వ జాతీయ రహదారి వెంబడి పలు పంట పొలాలు, లేఅవుట్ స్థలాలు అప్పట్లో పరిశీలించారు. చిత్రాడ శివారులోని ఒక భారీ వెంచర్ ఆవరణ ఇందుకు అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. మార్చి 12, 13, 14వ తేదీల్లో ప్లీనరీ ఉంటుందని అప్పట్లో ప్రకటించారు. తాజాగా నిర్ణయంలో మార్పు జరిగింది. జనసేన ఆవిర్భావ వేడుకలను 14న పిఠాపురంలో నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిర్ణయం తీసుకున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. అసెంబ్లీ, లోక్‌సభలో ఎన్నికల్లో నూరుశాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించిన తర్వాత నిర్వహిస్తున్న కార్యక్రమం కావడంతో భారీగా నిర్వహించాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి పవన్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

జీజీహెచ్‌లో ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

- రోగిని శస్త్రచికిత్సకు సిద్ధం చేసేందుకు లంచం డిమాండ్ చేసిన సిబ్బంది
- విచారణ అనంతరం చర్యలు తీసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్

జీజీహెచ్(కాకినాడ), జనవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలిలా ఉన్నాయి. జీజీహెచ్‌లోని ఫ్యామిలీ ప్లానింగ్ ఓటీలో కొద్దిరోజుల క్రితం ట్యూబెక్టమీ ఆపరేషన్ కోసం ఓ మహిళ చేరింది. ఆమెకు ఈ నెల 15వతేదీన శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ వ్యవహారంలో ఆ ఓటీలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వ్యవహరించిన తీరు ఆందోళన కలిగించింది. ఆమెను శస్త్రచికిత్సకు సిద్ధం చేసేందుకు ముగ్గురు సిబ్బంది లంచం డిమాండ్ చేశారు. డబ్బులు తర్వాత ఇస్తామనడంతో శస్త్రచికిత్సను తాత్సారం చేశారు. రూ.300 లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తర్వాత ఇస్తామని బాధితురాలి కుటుంబీకులు చెప్పినా వినలేదు. శస్త్రచికిత్సకు ఆటంకం కలిగించి డబ్బులు ఇచ్చిన తరువాత మాత్రమే ఆమెను సిద్ధం చేశారు. ఈ చేదు అనుభవాన్ని శస్త్రచికిత్స అనంతరం బాధితురాలి కుటుంబసభ్యులు ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శనివారం ఉదయం చోటు చేసుకోగా మధ్యాహ్నం వారు ఫిర్యాదు చేశారు. అదేరోజు సాయంత్రం ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ తమ బృందంతో విచారణ చేశారు. విచారణలో ఆరోపణలు వాస్తవాలుగా నిర్ధారణ అయ్యాయి. అదనంగా అక్కడ ఉన్న మరికొద్ది మంది రోగులను విచారించగా అక్కడ ఉన్న సిబ్బందితో పడుతున్న వ్యథను వారు కూడా అధికారులకు విన్నవించారు. అందుకు వీడియోఆధారాలను కూడా విచారణాధికారులకు అందించారు. ఆ నివేదికను ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారికి అందించారు. ఈ నేపథ్యంలో సోమవారం రెగ్యులర్ ఎఫ్ఎన్ఓ వీరలక్ష్మి, కాంట్రాక్ట్ బేసిక్ ఎంఎన్‌వో రవితేజ, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలు మంగలపై సస్పెన్షన్ వేటు వేస్తూ సోమవారం సూపరింటెండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు.

పిఠాపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం

- 20మందికి గాయాలు



పిచ్చికుక్క విచక్షణారహితంగా కరవడంతో గాయపడిన విద్యార్థి, చిన్నారి

పిఠాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేయడంతో 20మందికి గాయాలయ్యాయి. పిఠాపురం పట్టణంలోని మంగాయమ్మరావుపేట, చిట్టోడితోట పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పిచ్చికుక్క రోడ్డుపై వెళ్తున్నవారిపై దాడి చేసి గాయపరిచింది. పట్టణంలోని ఏకేపీఎం మునిసిపల్ ఉన్నత పాఠశాల, ఇతర పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, రోడ్డుపై ఆడుకుంటున్న మూడు సంవత్సరాల లోపు చిన్నారులతో సహా 20మందిని విచక్షణారహితంగా కరవడంతో గాయాలయ్యాయి. ఒక మహిళ తొడపై కరవడంతో తీవ్ర గాయమైంది. దీనితో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సాయంత్రం స్థానికులు కుక్కను హతమార్చారు. కుక్కకాటుతో గాయపడిన వారు పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి రాగా వైద్యులు చికిత్స అందించారు. ఇందులో ఇద్దరు చిన్నారులకు ముఖం, ఛాతిపై గాయాలవ్వడంతో వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు.

యువకుడి కిడ్నాప్ కేసులో ఐదుగురు వ్యక్తుల అరెస్టు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన యువకుడిని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసిన సంఘటనలో ఐదుగురు వ్యక్తులను సోమవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని దేవీనగరం ప్రాంతానికి చెందిన ఉమ్మిడి గంగాధర్‌ను కిడ్నాప్ చేసి పిఠాపురం పట్టణంలోని రథాలపేట శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి బీరుబాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేయడంతోపాటు సిగరెట్లతో కాల్చి చిత్రహింసలకు గురిచేసిన సంగతి తెలిసిందే. గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం గొల్లప్రోలు పట్టణానికి చెందిన బండి గణేష్, వి.శివాజీ పిఠాపురం పట్టణం రథాలపేటకు చెందిన గుర్రాల రాంబాబు, లచ్చబాబు, శీకోటి ఆకాష్‌లను అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రికెట్ అసోసియేషన్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు

- జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి); ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్‌లో నమోదైన క్రీడాకారులు, శిక్షకులు, అంపైర్లు, స్కోరర్లు అసోసియేషన్ అనుమతి లేకుండా ప్రైవేటు టోర్నమెంట్లలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొంత మంది అసోసియేషన్ అనుమతి లేకుండా ప్రైవేట్ టోర్నమెంట్లలో పాల్గొన్నట్టు తమకు తెలిసిందని, ఇక మీదట ఎవరైనా అలా చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఎవరైనా వ్యక్తిగతంగా అసోసియేషన్‌కి లిఖితపూర్వక దరఖాస్తు చేసుకుని అనుమతి వచ్చిన తర్వాతే టోర్నమెంటల్లో పాల్గొనాలన్నారు.

ఎంపీ సతీష్‌బాబును కలిసిన నాయకులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబును సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, నామినేటెడ్ ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, అమలాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు మర్యాద పూర్వకంగా కలిశారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగింపు



కాకినాడ ఆర్టీసీ డిపోలో ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేసిన అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్ ఆర్టీసీ సంస్థలో జరిగిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం కాకినాడ ఆర్టీసీ డిపోలో సోమవారం జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా కాకినాడ ట్రాఫిక్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.రమేష్, డి.రామారావు, కాకినాడ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్‌రెడ్డి, కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్ హాజరయ్యారు. డ్రైవర్ ప్రయాణికులను సురక్షితంగా ఏవిధంగా గమ్యస్థానాలకు చేర్చాలి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైవింగ్ మెళకువలు వివరించారు. జిల్లాలో 3 డిపోలైన కాకినాడ, ఏలేశ్వరం, తునిలో డ్రైవర్లుగా పనిచేస్తూ వారు ఉద్యోగ ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఒక్క ప్రమాదం కూడా చేయకుండా బస్సును నడిపిన 12మందికి, వారి కుటుంబసభ్యులకు ప్రశంసాపత్రాలు, క్యాష్ అవార్డులు అందజేసి సత్కరించారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి కాకినాడ డిపో నుంచి ఎంఎస్ఎన్ రాజు, ద్వితీయ బహుమతి కాకినాడ డిపో టి.శ్రీనివాసరావు, తృతీయ బహుమతి తుని డిపో కెవిఎస్‌వి రావు అందుకున్నారు. అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, డీపీటీవో ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కెఎం భాషా, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకర్‌రావు, పీఆర్వో సీ.వెంకటరాజు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

జడ్పీ సీఈవో లక్ష్మణరావు



పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెం-జల్లూరు మధ్య సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో నీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు అధికారులను ఆదేశించారు. పిఠాపురం మండలంలోని గ్రామాలకు తాగునీరు అందించే జల్లూరు-ఎఫ్‌కేపాలెం మధ్య గల సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఎనిమిది గ్రామ పంచాయతీలు, తొమ్మిది శివారు ప్రాంతాలకు ఈ పథకం ద్వారా తాగునీరు అందుతుందని తెలిపారు. పైపులైన్లు లీకేజీలు లేకుండా చూడాలని, ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని చెప్పారు. అవసరమైన మరమ్మతులను తక్షణం పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కుళాయిలు ద్వారా తాగునీరందించాలన్నారు. ఎంపీడీవో చిన్నారావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులున్నారు.

సామర్లకోట: సామర్లకోట మండలం కాపవరం గ్రామం కేంద్రంగా పలు గ్రామాలకు నిత్యం అందిస్తున్న తాగునీటి సరఫరా వేసవిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మండల అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో లక్ష్మణరావు ఆదేశించారు. కాపవరంలో సమగ్ర మంచినీటి సరఫరా పథకాన్ని ఆయన పరిశీలించారు. పథకంలో ఏ అవాంతరాలు ఎదురవ్వకుండా ముందస్తు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తాగునీటి సరఫరాపై అప్‌టుడేట్ సమాచారాన్ని తనకు పంపాలన్నారు. ఎంపీడీవో కె.హిమమహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పాల్గొన్నారు.

పిఠాపురం సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

పాడా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్



పిఠాపురంలో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్

పిఠాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు పాడా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ప్రస్తుతం ఉన్న పరిస్థితి, ఏయే సమస్యలు, అవసరాలు ఉన్నాయి, వాటిని ఏ విధంగా పరిష్కరించవచ్చు, ఇందుకు అవసరమైన నిధులు తదితర వివరాలను సేకరించారు. ప్రతి శాఖ పరిధిలో ఏ ఒక్క సమస్య అపరిష్కృతంగా ఉండిపోయిందనే మాట రాకుండా నూరుశాతం విషయాలను శాఖల వారీ నివేదికలో ఉంచాలని పీడీ ఆదేశించారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేసి రోగులకు ఇక్కడే అన్నిరకాల వైద్యసేవలు అందేలా చూడటం, పీహెచ్‌సీలను బలోపేతం చేయడం, అన్ని ఇంజనీరింగ్ విభాగాలు ద్వారా నూరుశాతం పనులు చేపట్టడంపై దృష్టి పెట్టినట్లు వివరించారు. 2029నాటికి నూరుశాతం శ్యాచురేషన్ మోడ్‌లో విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పాడా పీడీ శ్రీధర్ తెలిపారు. పీడీ పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. నగరపంచాయతీ తాగునీటి పథకం నుంచి నీరు వచ్చే అవకాశాలపై పరిశీలన చేయాలని పబ్లిక్‌హెల్త్ డీఈఈ గంగరాజును ఆదేశించారు. ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు గానూ క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయనున్నట్టు తెలిపారు. 17శాఖలకు సంబంధించిన అవసరాలు, ఇబ్బందులు గురించి తెలుసుకోవడానికి సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. ఏపీడీ వసంతమాధవి, ఎంఈవో-2 శివప్రసాద్ తదితరులున్నారు.

కన్నబాబుకు అభినందనలు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్‌గా మాజీ మంత్రి, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును ఆపార్టీ అధ్యక్షుడు జగన్ నియమించడంతో సోమవారం వైద్యనగర్‌లో కన్నబాబు నివాసానికి పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకుని పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియచేశారు. కన్నబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన రీజినల్ కోఆర్డినేటర్ పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కన్నబాబును కలసి అభినందించిన వారిలో ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి, జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ (కిట్టూ), ఉభయ గోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, మాజీ ఎంపీపీ గోపిశెట్టి పద్మజాబాబ్జి, పుల్ల కోటేశ్వరరావు ఉన్నారు.

ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమా?

కరప, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కరప-పెనుగుదురు, పెనుగుదురు-పాతర్లగడ్డ రహదారుల పక్కన పలువురు వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను ఇష్టానుసారంగా పారబోస్తు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. అసలే బర్డ్ ఫ్లూ వైరస్‌తో బెంబేలు చెందుతున్న ప్రజలు నివాసాల చెంత ఈ వ్యర్థాలను వేస్తుండడంతో భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీటితో బాటు తాగేసిన కొబ్బరి బొండాలు, ఎంగుగడ్డి వంటి వ్యర్థాలను పారబోయడంతో రోడ్ల మార్జిన్‌లు డంపింగ్‌యార్డులను తలపిస్తున్నాయని వాపోతున్నారు. ఈ వ్యర్థాల వల్ల అనారోగ్యాలు ప్రబలుతున్నాయని, చిన్నారులు రుగ్మతలకు గురవుతున్నారని ఆరోపిస్తున్నారు. స్వచ్ఛంధ్ర-స్వచ్ఛదివాస్ అంటూ హడావిడి చేస్తున్న అధికారులు రోడ్ల చెంతన నివాస ప్రాంతాల సమీపంలో వేస్తున్న వ్యర్థాలను పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. అధికారులు వెంటనే వ్యర్థాలను తొలగించి వాటిని పారబోస్తున్న వ్యాపారులపై చర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.



పెనుగుదురు-పాతర్లగడ్డ రోడ్డులో నివాసాల చెంత పారబోసిన కోళ్ల వ్యర్థాలు

సమస్యలు పరిష్కరించండి

వేతనాలు పెంచాలని డిమాండ్

పలుచోట్ల అంగన్‌వాడీల ధర్నాలు



కాకినాడలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్ల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కాకినాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.రమణమ్మ, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు నీరజ, జ్యోతి, రాజేశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారంలో చొరవ చూపించాలన్నారు. తక్షణమే గ్రాట్యుటి అమలు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఏళ్ల తరబడి మినీ సెంటర్లలో మెయిన్ సెంటర్లుగా చేయాలని పోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటం చూసి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎ.జ్యోతికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రమ, విజయ, మున్ని, సరోజ, ఎ.కనకదుర్గ, డి.మేరీరత్నం, జి.సత్యవతి పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: తమకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, సాధికారిక యాప్‌లో ఉద్యోగులుగా నమోదు కావడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా నష్టపోతున్నామని, తక్షణమే తొలగించాలని కోరుతూ అంగన్ వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సర్పవరం ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు,హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఆందోళన చేపట్టారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఏ.వీరవేణి, వీరమణి,కోశాధికారి వరలక్ష్మీ ఎన్నికల ముందు కోర్కెల సాధన కోసం 42 రోజులపాటు సమ్మె చేశామని, సమస్యలు పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. తక్షణమే హామీలు అమలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేదంటే ఈనెల 28 నుంచి మరింత ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సెక్టార్‌కు చెందిన కాకినాడ రూరల్, కరప నాయకులు ఉన్నారు.

పిఠాపురం: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మ, సీఐటీయూ నాయకుడు కుంచే చిన్నాలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 42 రోజులు పాటు సమ్మె చేయడంతో తమ డిమాండ్ల పరిష్కారానికి జీవోలు జారీ చేశారని తెలిపారు. ఇప్పుడు వాటిని తగ్గించి ఇస్తామని చెప్పడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. సమానపనికి సమాన వేతనం కింద రూ.26 వేలు చెల్లించాలని, పెంచిన ఈపీఎఫ్, పీఎఫ్ సదుపాయం కల్పిం చాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నాయకులు విజయశాంత, వెంకటలక్ష్మీ, ప్రజావాణి, భవానీ, పి.బేబీ, నాగగణిక, సూర్యకాంతం, సత్యవతి, సీఐటీయూ నాయకులు విశ్వనాథం, వీరబాబు తదితరులున్నారు.



పెద్దాపురంలో అంగన్‌వాడీల ధర్నా

పెద్దాపురం/సామర్లకోట): అంగన్‌వాడీ సిబ్బందికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పెద్దాపురం శాఖ ఆధ్వర్యంలో పెద్దాపురం ప్రాజెక్ట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిరసన నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు క్రాంతికుమార్, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలి





కాకినాడలో కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎంపీ సతీష్‌బాబు.. పెద్దాపురం: దివిలిలో రాజప్ప, తుమ్మల ప్రచారం

కూటమి నాయకుల ప్రచారం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఘన విజయం సాధించేలా శ్రమించాలని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం కాకినాడలోని క్యాంపు కార్యాలయం వద్ద ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాన్ని ఎంపీ విడుదల చేశారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని), మాజీ జడ్పీటీసీ తోట నవీన్, కాకినాడ జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణమూర్తి, రూరల్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ నులుకుర్తి వెంకటేశ్వరరావు, నాయకులు బోళ్ల కృష్ణమోహన్, గింజాల శ్రీనివాసరావు, గుత్తుల రమణ, కామాడి దశరథ, సిరియాల రాము, ఆళ్ల బాలకృష్ణ, పినపోతు తాతారావు, వెన్నపు చక్రధరావు, చింతపల్లి అర్జున్, యాళ్ల చక్రవర్తి, వాసంశెట్టి శివశంకర్ ఉన్నారు.

'రాజశేఖర్ విజయం ఖాయం'

పట్టభద్రుల మద్దతుతో ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం ఖాయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. నగరంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులను కలిసి రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందజేశారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో పట్టభద్రులంతా రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, చింతలపూడి రవి, అమలకంటి బలరామ్, పసుపులేటి వెంకటేశ్వరరావు, కోనాడ ప్రకాష్, పొంగా బుజ్జి, బంగారు సత్యనారాయణ, కోడూరి పెద్ద పాల్గొన్నారు.

పెద్దాపురం/సామర్లకోట: పేరాబత్తుల రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అభ్యర్థించారు. పెద్దాపురం మండలం దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల ప్రచారాన్ని కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి నిర్వహించి ప్రొఫెసర్లను కలిసి రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు తదితర కళాశాల అధ్యాపక బృందం రాజప్ప, తుమ్మలకు సాదరంగా స్వాగ తం పలికారు. కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి),ఎలిశెట్టి నాని తదితరులున్నారు.

కాకినాడ రూరల్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థి పేరాబత్తులకు రాజశేఖర్‌కు వేసి గెలిపించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. రూరల్ మండలం గంగనాపల్లి, కొవ్వాడ, కొవ్వూరులలో ఎమ్మెల్యే నానాజీ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. గత 6నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను చెబుతూ ఓటును అభ్యర్థించారు. ప్రచారంలో రూరల్ నియోజకవర్గ పరిశీలకులు ఎస్.సుధాకర్, కె.సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి టీడీపీ సమన్వయకర్త పిల్లి సత్తిబాబు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా,దాసు, శిరంగుశ్రీనివాసరావు, పాండ్రంకి రాజు ఉన్నారు.

సర్పవరం జంక్షన్: పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి తమ వంతు కృషి చేస్తామని ఏపీ ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల జేఏసీ ప్రతినిధులు తెలిపారు. కాకినాడ వెంకీ రెసిడెన్సీలో ఆధ్వర్యంలో ఏపీ ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల జేఏసీ ఆధ్వర్యంలో ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత కింద ఒకటి అంకె వేసి అత్యధిక మెజారిటీ సాధించేలా మద్దతివ్వాలని కోరారు. పలు కళాశాలల ప్రతినిధులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు. పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు కాకినాడ రూరల్ నేమాం, సర్పవరం, పండూరు, తిమ్మాపురం, సూర్యారావుపేట, కొవ్వాడ, చీడిగ, ఇంద్రపాలెం, తూరంగి, రమణయ్యపేట గైగోలుపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల అబ్జర్వర్ సుధాకర్, బొజ్జ భవానీ, పోసిన రాము, దాసరి శివ, బుజ్జి, పుల్ల శ్రీరాములు, పుల్ల వీరబాబు తదితరులున్నారు.



సర్పవరం జంక్షన్: పేరాబత్తుల రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, శేషారెడ్డి

నేటి నుంచి అంగన్‌వాడీ సిబ్బందికి జ్ఞానజ్యోతి శిక్షణ

సామర్లకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండల పరిధిలో 165 అంగన్‌వాడీ సిబ్బందికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 18 మంగళవారం నుంచి జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం రాత్రి విలేకర్లతో ఎంఈవో మాట్లాడుతూ ఇందుకోసం పసోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) సాంకేతిక సహకారం అందించనున్నట్లు తెలిపారు. మొదటి విడత బ్యాచ్ శిక్షణా తరగతులు 18నుంచి 20 వరకూ నిర్వహించనుండగా రెండవ బ్యాచ్ శిక్షణా తరగతులు 22,24,25 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. సామర్లకోట అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఉండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలను శిక్షణా కేంద్రాలుగా ఎంపికచేసి ఏర్పాట్లు చేసామన్నారు. శిక్షణా తరగతులకు కోర్సు డైరక్టర్లుగా ఎంఈవో శివరామకృష్ణయ్య, వెన్యూ ఇంచార్జిగా తోటకూర సాయిరామకృష్ణ, కూర్మారావులను నియమించామన్నారు. ఉండూరు ఉన్నత పాఠశాలలో 94 మంది అంగన్‌వాడీ సిబ్బందికి, సామర్లకోటలో 71 మంది సిబ్బందికి తరగతులు ఇస్తామని.. ఎంపీడీవో కె.హిమమహేశ్వరి, పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జీ.ఉషా, ఎంఈవో-2 పట్టపగలు పుల్లయ్య పర్యవేక్షిస్తారని ఆయన పేర్కొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో అరట్లకట్ట విద్యార్థి ప్రతిభ



కరప: సురేష్‌కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్

కరప, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కరప మండలం అరట్లకట్ట గ్రామానికి చెందిన యాళ్ల సురేష్‌కుమార్ అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో అదరగొట్టాడు. ఏడో తరగతి చదువుతున్న సురేష్‌కుమార్ ఈనెల 1నుంచి 5 వరకు న్యూ ఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫోర్త్ వాకో ఇండియా కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో పాల్గొని 3 పతకాలను సాధించాడు. క్రియేటివ్ ఫోంలో బంగారు పతకం, లైట్ కాంటాక్ట్ విభాగంలో 2 కంచు పతకాలను సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా తండ్రి యాళ్ల అంజిబాబుతో కలిసి సురేష్‌కుమార్ సోమవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తాను సాధించిన పతకాలను చూపించారు. ప్రతిభ చాటిన సురేష్‌కుమార్‌ను కలెక్టర్ అభినందించి రూ.10 వేల ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. అనంతరం కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని కలవగా అభినందనలు తెలిపి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విశ్వహిందూపరిషత్ జిల్లా మాజీ కార్యదర్శి వెలుగుబంట్ల శ్రీనివాస్, టోర్నమెంట్ రింగ్ రిఫరీ అంజనీకుమార్, కోచ్ సీహెచ్.వినయ్‌కుమార్, జనసేన నాయకులు బత్తుల సతీష్, వెలుగుబంట్ల రామకృష్ణ, పవన్ పాల్గొన్నారు.

కార్పొరేషన్(కాకినాడ): ఢిల్లీలో జరిగిన వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో మూడు మెడల్స్ సాధించిన యాళ్ల సురేష్‌కుమార్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో కెవి పెద్ద అప్పాజీ, రవీంద్ర, చోడిశెట్టి రమేష్‌బాబు, బుల్లెట్ సురేష్‌బాబు, కంచుమర్తి చిన్న అప్పాజీ, తుమ్మలపల్లి నాని పాల్గొన్నారు.

ముసాలమ్మతల్లి సంబరం

కరప, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వేములవాడ గ్రామదేవత ముసాలమ్మతల్లి సంబరం సోమవారం ఘనంగా ప్రారంభమయ్యింది. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన ముగ్గురు ముత్తైదువులను అమ్మవారిగా భావించి మంగళ స్నానాలు చేయించారు. ముసాలమ్మకు ప్రత్యేక పూజలు చేసి రాత్రికి జాతర చేశారు. మంగళవారం గరగల ఊరేగింపు, బుధవారం అమ్మవారికి మొక్కులు తీర్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 3రోజుల బాటు జరిగే ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

'అంకిత భావంతో గుర్తింపు'



ఐఎల్‌ఏ కొత్త బాడీని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పారదర్శకతతో కూడిన అంకిత భావం పదవికి గుర్తింపునిస్తుందని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరావు అన్నారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్‌ఏ) ఉమ్మడి జిల్లాకు కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు పి.పృథ్వీరాజ్, ఉపాధ్యక్షుడు కోలా శ్రీహరిరావ్, ట్రెజరర్ జెవి రమణలను బార్ అసోసియేషన్ సోమవారం ఘనంగా సన్మానించి సత్కరించింది. ఈ సందర్భంగా విశ్వేశ్వరావు మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఐఎల్‌ఏ చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చక్కా శ్రీనివాసరావ్, మాజీ అధ్యక్షుడు పేపకాయాల రామకృష్ణ, అశోక్ కుమార్, ఐఎల్‌ఏ రాష్ట్ర కార్యదర్శి వడ్డీ శ్రీనివాస్‌బాబు, సీనియర్ న్యాయవాదులు అవసరాల నాగరాజు, వారా రాజుబాబు, కంబాల శీధర్, డిఎల్ నరసింహరావ్, పెదగాడి వెంకటరమణ, యనమల రామం,సయ్యద్ సాలార్ ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

సామర్లకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామభీమేశ్వరాలయంలో దేవదాయ శాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన కలిదిండి భాస్కరనారాయణరాజు కుమార్తె కలిదిండి ఆశా,కాళీచరణ్‌ల పేరిట రూ.1,01,116లు చెక్ రూపంలో ఆలయ ఈవో బళ్ళ నీలకంఠంకు సోమవారం అందజేశారు. ముందుగా కలిదిండి కుటుంబసభ్యులతో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి నంది మండపం వద్ద వేదాశీర్వచనం అందజేశారు. ఈవో స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేశారు.

రక్తదాన శిబిరం

పెద్దాపురం/సామర్లకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం సాయిసేవా గ్రూపు ఆధ్వర్యంలో అద్దేపల్లి రమేష్ నేతృత్వంలో సోమవారం తాళ్ళూరి సత్రం నందు ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంకు సంయుక్త సౌజన్యంతో ఏర్పాటుచేసిన శిబిరంలో 175మంది రక్తదానం చేసారు. దేవత రాజశేఖర్ సౌజన్యంతో దాతలకు 10 రకాల పౌష్టికాహారాన్ని, గ్లూకోజ్ ప్యాకెట్లను అందజేశారు. డాక్టర్ తాళ్ళూరి శేఖర్,డాక్టర్ తాళ్ళూరి గీతలు పర్యవేక్షించారు.

మాజీ క్రికెటర్ మృతికి సంతాపం

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన మాజీ క్రికెటర్ కెవిఎస్ఆర్‌కె రెడ్డి మృతి జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు తీరని లోటని కార్యదర్శి పి.సత్యనారాయణ అన్నారు. రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిల్లా అసోసియేషన్‌కు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

పెద్దాపురం/సామర్లకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):పెద్దాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జీ.రాగంపేటలో ఎస్‌ఐ మౌనిక ఆధ్వర్యంలో సోమవారం పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కోర్టు ఎదుట హాజరుపర్చనున్నట్టు తెలిపారు.

కిరాణా దుకాణంలో చోరీ

పిఠాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. పట్టణంలోని వస్తాదు వీధికి చెందిన కోళ్ల వీర వెంకటసత్యనారాయణ కిరాణా దుకాణం నిర్వహిస్తూ ఉంటాడు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి వచ్చిచూసేసరికి దుకాణంపై స్లాబుకు రంధ్రం చేసి దొంగలు లోపలకి ప్రవేశించి రూ.25వేలు విలువైన నగదు, కిరాణా సామాన్లు చోరీ చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

ఎట్టకేలకు రంగు వేశారు!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనల మేరకు కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో గల బ్యాంకు కాలనీ సచివాలయం-2 భవనంపై ఉన్న మాజీ సీఎం జగన్ ఫొటో కనిపించకుండా ఎట్టకేలకు ఎంసీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్సీ కోడ్ వర్తించగా అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎన్నికల అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ చిత్రపటం కనిపించకుండా రంగు వేయించారు.



జగన్ ఫొటోకు రంగు వేసిన దృశ్యం

'మాంసం విక్రయదారులు నిబంధనలు పాటించాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మాంసం విక్రయదారులు నిబంధనలు పాటించాలని పంచాయతీ కార్యదర్శి పద్మరాజు కోరారు. సోమవారం ఆయన మాంసం విక్రయదారులతో సమావేశమయ్యారు. బర్డ్ ఫ్లూ, ఇతర వ్యాధుల దృష్ట్యా ప్రజారోగ్యం దెబ్బతిన కుండా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవహరించాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: కలెక్టర్



పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి ఆయన మండలంలోని బూసిగూడెం గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీలతో కలిసి తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్న తీరును విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును తరగతి గదులకు వెళ్లి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి, డీఈవో వై.మల్లేశ్వరరావు, తహశీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో సుందం శ్రీనివాస్‌దొర, ఈఈ ఐ.శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యువో రామతులసి, మండల విద్యాశాఖాధికారి రామకృష్ణ, డీఈఈ చైతన్య, ప్రధానోపాధ్యాయుడు రామారావు, ఎస్ఐ వెంకట్రావు పాల్గొన్నారు.

చిత్రలేఖన ఉపాధ్యాయుడికి జాతీయ స్థాయి మెరిట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు కొండబాబు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు క్రియేటివ్ ఫైన్ ఆర్ట్ ఐ అకాడమీ నిర్వహించిన ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్‌లో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు మిరియాల కొండబాబు జాతీయ స్థాయిలో మెరిట్ అవార్డు సాధించారు. ఆయనకు శ్రీనివాస్ తన్నీరు, డాక్టర్ జీవై గిరి, కేపీ బాబు అవార్డు అందజేసి సత్కరించారు.

తడికి వాగు, నారాయణపురం గ్రామాల్లో తాగునీటి బోరు ఏర్పాటు



బోర్ వేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో తడికివాగు గ్రామంలో ఉంటున్న కొందు జాతి గిరిజనులకు మంచినీరు అందుబాటులో లేకపోవడంతో కొండవాగుల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. వర్షాకాలంలో నీరు కలుషితం కావడంతో రకరకాల వ్యాధులకు గురవుతున్నారు. దీంతో వారి సమస్యలను ఆయుర్వేద వైద్యుడు, జేకేసీ ట్రస్టు చైర్మన్ జమాల్‌ఖాన్ దృష్టికి తీసుకురాగా బోరును ఏర్పాటు చేశారు. తుమ్మలపల్లి పంచాయతీలోని నారాయణపురం గ్రామంలో గిరిజనులు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని సీపీఎం నాయకుడు, మండల కార్యదర్శి పల్లపు వెంకట్, సీసం సురేష్ ఆయనకు తెలుపగా వెంటనే స్పందించి గిరిజనుల దాహార్తి తీర్చేందుకు బోర్ వేయించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పోడియం కిట్టయ, పటేల్, కోరం లక్షమయ, సవలం పంతులు, సోడి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం.3కి చట్టబద్ధత కల్పించిన తర్వాతే డీఎస్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

దేవీపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు అరకులో ఆదివాసీ నిరుద్యోగ ఉపాధ్యాయ పట్టభద్రులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు జీవో నెంబరు 3ను తిరిగి పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ అన్నారు. జీవో నెంబరు 3పై స్పష్టమైన ప్రకటన ఇచ్చిన తర్వాతే జనరల్ డీఎస్సీ 2025 నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ట్రైబల్ అడ్వైజర్ కమిటీ తక్షణమే ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో అసెంబ్లీలో నిరసన, ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పేద కుటుంబానికి పాత్రికేయుల ఆర్థిక సాయం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి తమ వంతు సాయం అందించడంలో నిజమైన సంతోషం ఉందని నమ్మిన జర్నలిస్టులు సోమవారం రాజవొమ్మంగి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అరిపాక సూరిబాబు, ఉపాధ్యక్షుడు ఊటాల ఉదయభాను ఆధ్వర్యంలో పేద కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. మండలంలోని చికిలింత గ్రామంలో జుర్రా నూకరత్నం అనే గిరిజన మహిళ అన్నవాహిక సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న రాజవొమ్మంగి పాత్రికేయులు వారి కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. సీనియర్ పాత్రికేయులు పి.రామరాజు, దుర్గాప్రసాద్, బి.శ్రీను, సతీష్, ఈ.శ్రీను, లక్ష్మణ్, కె.శ్రీను పాల్గొన్నారు.

గొర్లగూడెంలో తాటాకిల్లు దగ్ధం



చింతూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అల్లూరు జిల్లా చింతూరు మండలం కుమ్మూరు పంచాయతీలోని గొర్లగూడెం గ్రామంలో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామంలోని మడకం రామ్మూర్తికి చెందిన వంట పాకకు తొలుత ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ఆ తర్వాత పక్కన ఉన్న అతని ఇంటికి కూడా మంటలు వ్యాపించి క్షణాల్లో ఇల్లు మొత్తం దహనమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు బూడిదయ్యాయి. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఈసారైనా...భక్తులకు పడవ సౌకర్యం కలిగేనా!

కూనవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి పడవ సౌకర్యం లేకపోవడంతో దాని ఉనికి కోల్పోవలసి వస్తుందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఈఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి. గోదావరికి ఎదురుగా ఉన్న అల్లూరి జిల్లా నుంచి ఎక్కువగా గోదావరి పడవ దాటుకుని భక్తులు వస్తుంటారు. వైసీపీ పాలనలో పడవను నిషేధించడంతో అటు నుంచి వచ్చే భక్తుల సంఖ్య దాదాపుగా తగ్గిపోయింది. అంతేకాకుండా ఆలయ ఆదాయం సైతం కోల్పోవలసి వచ్చింది. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో గిరిజనులు మొక్కులు చెల్లిస్తారు. పడవ సౌకర్యం లేకపోవడంతో మొక్కులు చెల్లించలేకపోతున్నామని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పడవ సౌకర్యం ఏర్పాటుచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

రోడ్డుపై పశువులు.. ప్రయాణికుల ఆందోళన



రహదారి మధ్యలో పశువులు

మోతుగూడెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం-భద్రాచలం రోడ్డు, మోతుగూడెంటు వైజాగ్ రోడ్డులో పలుచోట్ల రహదారులపై పశువులు నిల్చుండిపోవడంతో ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రివేళల్లో వాటి వల్ల ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆంధ్రాబ్యాంక్ రోడ్డులో పశువులు పరిగెత్తుతూ రహదారిపైకి రావడంతో ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. రెండు రోజుల క్రితం మార్కెట్ మెయిన్ రోడ్డులో ద్విచక్రవాహనదారులు పశువులను ఢీకొట్టారు. రోడ్డుపైకి పశువులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. దీనిపై మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్‌ని వివరణ అడగగా పశువుల యజమానికి నోటీసులు ఇస్తామని, ఇంటి వద్ద పశువులు కట్టుకోవాలని బహిరంగ ప్రదేశాల్లో వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ సెక్రటరీ తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు





ఏలేశ్వరంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు, జగ్గంపేటలో ప్రచారం చేస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్

పట్టభద్రుల ఎమ్మెల్సీకూటమి అభ్యర్థి రాజశేఖరానికి మద్దతుగా ప్రచారం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి విజయం చేకూర్చాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. సోమవారం ఆమె ఎన్నికల పరిశీలకుడు గంటా నూకరాజుతో కలిసి చినశంకర్లపూడిలో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ నాయకులు మిరియాల శ్రీనివాస్, యర్రాబత్తుల గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ అధ్యక్షుడు మూది నారాయణస్వామి పట్టభద్రులను కోరారు. సోమవారం ఆయన నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డులతో పాటు, సి.రాయవరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి రాజశేఖరానికి మద్దతుగా ప్రచారం చేశారు. కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, టీడీపీ నాయకులు పలివెల శ్రీనివాస్, బుగతా శ్రీనివాస్, కోరాడ కృష్ణమోహన్, గెద్ద అప్పన్న, దేవర రాజు, ఈపి ప్రసాద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ఎన్నికల పరిశీలకుడు నూకరాజుతో ప్రచార సరళిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా జగ్గంపేటలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ప్రచారం నిర్వహించారు. రాజశేఖరానికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో సూరంపాలెం బాలు, మరిసే రామకృష్ణ, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, సురపరెడ్డి నరేష్, అడబాల వీరబాబు, స్వామి, శృంగరాయునిపాలెం నాగు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. టీడీపీ జగ్గంపేట మండల శాఖ అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ మారిశెట్టి పాపారత్నం తనయుడు జగ్గారావు- మౌనిక దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో సోమవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టౌన్ అధ్యక్షుడు పాండ్రంగి రాంబాబు, జగ్గంపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మారిశెట్టి రాధా, కింగం రమణ, నలమాటి ఆనంద్, డేగల సత్తిబాబు, ఆశీర్వాద్, రియల్ ఎస్టేట్ రాజు, కోడూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.





ప్రత్తిపాడు, శంఖవరంల్లో ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

వేతనాలు పెంచాలని అంగన్వాడీల ధర్నా

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, యూటీఎఫ్ కార్యదర్శి రామలింగేశ్వరరావు, కోటిపల్లి సునీత, అల్లాడి లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. హేమలత, నాగసత్యవతి, అమరావతి, కె.మిరియాల పద్మావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో సోమవారం ఆందోళన చేపట్టారు. బుల్లెమ్మ, రత్నకుమారి, రాజేశ్వరి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'మహిళా శక్తి సంఘాలు బలోపేతం కావాలి'



ప్రత్తిపాడులోని వెలుగు కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి సంఘాలు బలోపేతం కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అద్దంకి శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఆయన ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబుతో కలిసి మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా శక్తి సంఘాలు పనితీరులో అగ్రగామిగా నిలవాలన్నారు. సంఘాలకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు, స్త్రీ నిధి, ఇతర పథకాలను వివరించారు. బ్యాంకులు అందించే రుణాలను ఏపీఎం వై.వెంకట్ వివరించారు. సీసీలు శ్రీనివాస్, నాగరత్నం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలోని మహిళా మార్ట్‌ను డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. సేల్స్ ఎందుకు తగ్గాయి అని అధికారులను ఆరా తీశారు. సేల్స్ పెరగడానికి సరైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పీడీ వెంట డీపీఎం డి.వెంకటేశ్వరరావు, ఏపీఎం వేదకుమారి, ఎస్.బుల్లియ్య, వై.లోవరాజు, మార్ట్ సిబ్బంది ఉన్నారు.



తహసీల్దారు తాతారావుకు సమస్య వివరిస్తున్న గిరిజనులు, జనసేన నాయకులు

'మా భూములు ఆన్‌లైన్‌లో కనిపించట్లేదు'

శంఖవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ కొండపోడు భూములు ఆన్‌లైన్‌లో కనిపించట్లేదని పెదమల్లాపురం గిరిజనులు తహసీల్దారు తాతారావు వద్ద గోడు వెలిబుచ్చారు. సోమవారం వారు జనసేన నేతల ఆధ్వర్యంలో తహసీల్దారును కలిసి వినతిపత్రం ఇచ్చారు. తమ భూములకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు, పాస్ పుస్తకాలు ఉన్నా ఆన్‌లైన్‌లో చూపించట్లేదన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించి ఫిర్యాదుదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామని తహసీల్దారు చెప్పారు. టెలికమ్యూనికేషన్ సలహా మండలి సభ్యుడు మేకల కృష్ణ, జనసేన మండల శాఖ ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి, గొర్లి నాగేశ్వరరావు, జర్తా సరస్వతి, లోతా వెంకటరమణ, ఆవూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న దృశ్యం

ఆదిత్య ఫోరెనిక్స్ కళాశాలలో స్వచ్ఛ భారత్

గండేపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 సహకారంతో ఫోరెన్సిక్ సైన్స్ విభాగం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.విద్యాసాగర్ ఆధ్వర్యంలో 20 మంది వలంటీర్లు క్యాంపస్‌ను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్ విద్యార్థులకు పరిశుభ్రత, అటవీకరణ ప్రాముఖ్యతను వివరించారు.



వేలంకలో చేపల చెరువు వద్ద యజమానులకు కోళ్ల వ్యర్థాలపై సూచనలు ఇస్తున్న పశువైద్యాధికారులు

చేపల చెరువుల తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కిర్లంపూడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 'చేపల చెరువుల్లోకి కోళ్ల వ్యర్థాలు' పేరిట సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించారు. పెద్దాపురం ఏడీ రామస్వామి, కిర్లంపూడి పశువైద్యాధికారి వినోద్ మండలంలోని చేపల చెరువులను తనిఖీ చేశారు. వేలంకలో చేపల చెరువును పరిశీలించి యజమానితో మాట్లాడి పలు సూచనలు చేశారు. కోళ్ల వ్యర్థాలు వేసి చేపలు పెంచరాదని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిశీలనలో వీఎఫ్‌ఏ మౌనిక, వీఆర్వో వి.సుధీర్ పాల్గొన్నారు.



అన్నదాన విభాగం సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న కృష్ణంరాజు దంపతులు

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి అన్నవరానికి చెందిన జంపన సత్యహరిత-కృష్ణంరాజు దంపతులు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని అన్నదాన విభాగం సూపరింటెండెంట్ రామకృష్ణ, ఏఈవో భ్రమరాంబలకు సోమవారం అందజేశారు. దాతను వారు అభినందించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

'బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉండండి'

శంఖవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ నిర్ధారణ కాలేదని, ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి కాకర్ల ప్రసాద్ కోరారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలోని ఓ కోళ్లఫారంలో వందల సంఖ్యలో మృతి చెందిన కోళ్ల అవశేషాలను ల్యాబ్‌కు పంపినట్టు తెలిపారు. సోమవారం మండలంలోని అన్ని కోళ్లఫారాల యజమానులతో తామే మాట్లాడామని, గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. కోళ్ల ఫారాల నుంచి రాకపోకలు నిలిపివెయ్యాలని ఆదేశించామన్నారు. ఎక్కడైనా కోళ్లు చనిపోతే తమకు తెలియపరచాలని ప్రసాద్ కోరారు. కోడి మాంసాన్ని, గుడ్లను ఉడికించి తినడం వల్ల బర్డ్ ఫ్లూ సోకదని చెప్పారు.

ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్ ఆర్టీసీ సంస్థలో జరిగిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం కాకినాడ ఆర్టీసీ డిపోలో సోమవారం జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా కాకినాడ ట్రాఫిక్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.రమేష్, డి.రామారావు, కాకినాడ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్‌రెడ్డి, కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ డ్రైవర్ ప్రయాణికులను సురక్షితంగా ఏవిధంగా గమ్యస్థానాలకు చేర్చాలి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైవింగ్ మెళకువలు వివరించారు. జిల్లాలోని మూడు డిపోలైన కాకినాడ, ఏలేశ్వరం, తునిల్లో డ్రైవర్లుగా పనిచేస్తూ వారు ఉద్యోగ ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఒక్క ప్రమాదం కూడా చేయకుండా బస్సులు నడిపిన 12మందికి, వారి కుటుంబసభ్యులకు ప్రశంసాపత్రాలు, క్యాష్ అవార్డులు అందజేసి సత్కరించారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి కాకినాడ డిపో నుంచి ఎంఎస్ఎన్ రాజు, ద్వితీయ బహుమతి కాకినాడ డిపో టి.శ్రీనివాసరావు, తృతీయ బహుమతి తుని డిపోకు చెందిన కేవీఎస్‌పీ రావు అందుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, డీపీటీవో ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కెఎం భాషా, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకర్‌రావు, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్డంగి వద్ద రహదారిపై గొయ్యి



రహదారిపై గొయ్యి పడిన దృశ్యం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్డంగి నుంచి అడ్డతీగల మండల డి.భీమవరం వెళ్లే ప్రధాన రహదారిలో జడ్డంగి దుర్గాదేవి ఆలయం వద్ద మడేరు ఎడమ కాలువపై నిర్మించిన వంతెన వద్ద రోడ్డుకు పెద్ద గొయ్యి పడింది. భారీ వాహనాలు తిరగడం వల్ల గొయ్యి పడడంతో రేవటిపాలెం, చిన్నయ్యపాలెం, వెలగలపాలెం, దోనెలపాలెం, జమ్మిచావిడి, బోనంగిపాలెంకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడ్డతీగల మండలం దొరమామిడి మీదుగా డి.భీమవరం చేరుకోవడానికి ఇదే రహదారిపై ప్రయాణం చేయాలి.

విలేకరిపై దాడి హేయమైన చర్య

రాజవొమ్మంగి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలో మక్కువ మండల విలేకరి మల్యాడ రామారావుపై టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు దాడి హేయమని ప్రెస్‌క్లబ్ నాయకులు అన్నారు. సోమవారం రాజవొమ్మంగి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. పాత్రికేయులు ఎ.సూరిబాబు, యు.ఉదయభాను, పి.రామరాజు, జి.బాలరాజు, కె.శివ, ఇ.శ్రీను, కె.శ్రీను, లక్ష్మణ్ పాల్గొన్నారు.